**సంపాదకీయం**



# సవాళ్ళు

మరో సంవత్సరం గడచిపోయింది. ఇంకొక కొత్త సంవత్సరం మొదలైంది. పాత సంవత్సరానికి వీడ్కోలు, కొత్త సంవత్సరానికి స్వాగతం షరా మామూలే. అయితే, ఏ వ్యక్తి లేదాసంస్థ లేదా వ్యవస్థ అయినా సుస్థిరంగా, క్రమ క్రమాభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే, కేవలం కాలాన్ని గడిపివేయడం, లేదా గడచిపోనివ్వడం కాకుండా, అనునిత్యం కాలం నేర్పే పాఠాలను గ్రహించి, ఎప్పటి కప్పుడు తన గమనాన్ని, ప్రణాళికను తన లక్ష్య సాధనకు అనువుగా మలచుకుంటుండడం అవసరం. లేకుంటే, కాలంతోపాటే మన కలలు, ఆకాంక్షలు, లక్ష్యాలు, ప్రణాళికలు కాల గర్భంలో కలసిపోతాయి. ఆ దృష్ట్యా చూసినపుడు సంవత్సరకాలం, దాని ప్రభావం, పర్యవసానం చిన్న విషయాలేమీకావు. తప్పక సునిశితంగా సమీక్షించుకుని, జరిగిన మంచిని మరింతగా పెంపొందించుకునే విధంగా, ఎదురైన చేదు అనుభవాలు మళ్ళీ ఎదురుకాకుండా కొత్త సంవత్సర వ్యూహాలను రూపొందించుకోవడం మరింత అవసరం. గడచిపోయిన 2010 సంవత్సరాన్ని ఈ విధంగా విశ్లేషిస్తే, ముఖ్యంగా, ఈ ఏడాదికాలం మహిళలపైన,పేదలపైన, స్వయంసహాయరంగంపైన చూపిన ప్రభావాన్ని సమీక్షించుకుంటే, ప్రగతిఫలాల కంటె, పెనుసవాళ్ళే ఎక్కువగా కనిపిస్తాయి.

ముఖ్యంగా, సూక్ష్మ రుణ సంస్థల (ఎంఎఫ్ఐల) అప్పుల కారణంగా చెలరేగిన అల్లకల్లోలం, సంభవించిన మరణాలు స్వయం సహాయ రంగాన్ని ఒక్క కుదుపు కుదిపాయి. అటు ప్రభుత్వము, ఇటు ఏపిమాస్‌లాంటి సంస్థలు జరిపిన అధ్యయనాలు స్వయం సహాయ రంగాన్ని ఎంఎఫ్ఐలు ఎంతగానో విచ్ఛిన్నం చేస్తున్న, స్వయంసహాయ స్ఫూర్తిని నిలువునా నీరుగారుస్తున్న దుస్థితిని వెల్లడించాయి. స్వయం సహాయ వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందా అనే సందేహాన్ని కలిగించాయి. కారణాలేవైనా స్వయం సహాయ ఉద్యమానికి ఇదొక పెనుసవాలు. ఈ సవాలును సంఘటితంగా, వ్యూహాత్మకంగా, అసలైన స్వయం సహాయ స్ఫూర్తితో ఎదుర్కోవడంలోనే స్వయంసహాయ ఉద్యమ సుస్థిరత్వమేకాదు, ఆ రంగం మనుగడసైతం ఆధారపడి వుంటుంది. ఈ కృషిలో, తనవంతు తోడ్పాటు అందించ డానికి ఏపిమాస్ సిద్ధంగా వుంది. అటు ప్రభుత్వము, సెర్ప్ కూడా ఈ సమస్యను తీవ్రంగా పరిగణించి, ఆర్డినెన్స్‌ను, చట్టాన్ని తీసుకురావడంతోపాటు కొన్ని ఇతర చర్యలను కూడా చేపట్టాయి. అయితే, మరింత వాస్తవిక దృక్పథంతో ఆచరణయోగ్యమైన పథకాలతో ఈ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని కనుగొనే బాధ్యత వాటిపైన వుంది. సంస్కరణల పేరుతో సహకార రంగాన్ని నిర్వీర్యంచేసే విధంగా కొత్త చట్టాన్ని తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలు, ఈ సంవత్సరంలో ఎదురైన మరో బాధాకరమైన అనుభవం. అకాల వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమై ఎందరో రైతులు ఆత్మహత్యలకు పాల్పడడం, ప్రేమోన్మాదంతో బాలికలపై చెలరేగిన అఘాయిత్యాలు మొదలైన వన్నీ 2010 సంవత్సరాన్ని మరచిపోలేని విధంగా చేసిన చెరిగిపోని మరకలే. అయితే నిరాశతో నీరసించడం కాక, మనో ధైర్యంతో సంఘటితంగా, వ్యూహాత్మకంగా ఎదుర్కుంటేనే ఈ సమస్యలు పరిష్కారమవుతాయి. ఆ రకమైన ఉద్యమ స్ఫూర్తిని ఈ కొత్త సంవత్సరం మనందరిలో రగిలిస్తుందని, ఈ పెను సవాళ్ళకు శాశ్వత పరిష్కారాలను కనుగొన్న సంవత్సరంగా చరిత్రలో నిలిచిపోగలదని ఆశిద్దాం.

ఈ కొత్త సంవత్సరంలో అందరికీ ఎంతో మేలు జరగాలని ఆకాంక్షిస్తూ...



**జీవన వేదం**

# *గాలివాటం!*

"ఉన్నది పుష్టి మానవులకో యదునందన, ఆలజాతికిన్ తిన్నది పుష్టి...' అంటూ, 'పాండవోద్యోగ విజయాలు' నాటికలో తిరుపతి వేంకట కవులు ఒక నిత్యసత్యాన్ని నిక్కచ్చిగా చెప్పారు. అంటే, సంపద ఎంతగా వుంటే, మనిషి అంత బలవంతుడవుతాడన్న నేటి లోకనీతిని, రీతిని విశదీకరిస్తుంది ఈ కవి వాక్యం. బెల్లం చుట్టూ చీమలు చేరడం ఎంతసహజమో, అధికారం వున్న వారి చుట్టూ, ధనవంతులచుట్టూ జనం మూగిపోవడం కూడా అంతే సహజం. చూస్తూనే వున్నాం కదా, ఇలాంటివారు కనిపించగానే, తరతరాల బంధుత్వాలు, స్నేహ బంధాలు, వున్నవీ లేనివీ, వున్నట్టుండి గుర్తుకు రావడం ! ఒక్కసారిగా జ్ఞానోదయమై, వారే మహోన్నత వ్యక్తులుగా, లోకనాయకులుగా వీరికి కనువిందుకావడం. అప్పటివరకు, మరెవరైనా ఇదే కోవలో కనిపించి వుండవచ్చు, కాని అది గతం. ఈ కొత్త దేవుడి దర్శనం కాగానే, వారు ఎందుకూ కొరగానివారన్న ప్రాప్తకాలజ్ఞానం వీరి గుండెలోతులనుంచి తన్నుకు వస్తుంది. కాని, ఇది ఎంతవరకు అంటే, ఇంతకంటే మరో గొప్ప ఆకర్షణ కనిపించే వరకు అని వేరే చెప్పవలసిన పనేముంది?అయితే,వినడానికి వింతగావున్నా, బలం వున్నంతవరకే స్నేహం, బలం లోపిస్తే వైరం అనేది ప్రకృతి స్వభావమేనట! ఒక శ్లోకంద్వారా మనం ఆ సమన్వయాన్ని తెలుసుకోవచ్చు. మంటలు చెలరేగుతున్నప్పుడు గాలివీస్తే ఆ మంటలు మరింత ఉధృతమవుతాయి. దీనినే మనం 'అగ్నికి వాయువు తోడైనట్టు' అని అంటాం. నిజమే, మంట పెద్దదికదా అని, వాయువు ఆ అగ్నితో స్నేహం చేశాడు. మరి చిన్న మంట అయితేనో? చెప్పేదేముంది, 'గాలిలో దీపం పెట్టినట్టు' ఆ గాలే దానిని ఆర్పేస్తుంది. చూశారా, మన అధికార, ధన క్షణక్షణిక బంధాలు ఎంత ప్రకృతి సహజమైనవో!

ఆసక్తి గలిగినవారికోసం ఆ శ్లోకం:

**వనాని దహతో వహ్నే: సఖాభవతి మారుత:**
**స ఏవ దీప నాశాయ కృశో కస్యాస్తి సౌహృదం**

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt. Limited (KJPL), 1-160/5, RTC 'X' Roads, Musheerabad, Hyderabad; Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.20, Rao & Raju Colony, Road No.2, Banjara Hills, Hyderabad-500 034. **Editor:** T. Chandra Sekhar Reddy.

**ఆలోచనలు ఆయుధాలకంటె పదునైనవి**

MS January fianl pages-Final.pmd 3 12/31/2010, 10:35 AM

## లోపలి పేజీలలో ....


- ఎం.ఎఫ్.ఐ.లను నియంత్రించాలి ...05
- అవివాహిత కుమార్తెకు జీవితాంతం పింఛన్ ...11
- ఆర్థిక చేకూర్పులో అయోమయం ...12
- నిరంతర ఉచిత న్యాయసహాయం ...13
- గ్రామాన్ని బాగుచేసిన మహిళాచైతన్యం ...14
- రద్దుబాటలో డీసీసీబీలు ...16
- మైక్రో సంస్థలకు అప్పులు ఆపవద్దు ...17
- విభిన్నపథంలో విజేతలు ...18
- గృహహింస నిరోధక చట్టం ...20
- సామాజిక సహాయ పథకం ...22
- చింతలు తీర్చిన టిఫిన్‌సెంటర్ ...24
- బేకరీ బిస్కెట్ల తయారీ పరిశ్రమ ...25
- ఉత్తమ మండల సమాఖ్య అవార్డు ...29
- గర్భిణులకు నగదు బదిలీ ...29
- సంఘాలద్వారా ఎరువుల సరఫరా ...34



**ఎడిటర్**
టి. చంద్రశేఖర రెడ్డి
**అసోసియేట్ ఎడిటర్**
జె.వి. క్రిష్ణమూర్తి

**ఎడిటోరియల్ కమిటి**
ఎన్.వినాయకరెడ్డి, సి.నారాయణ రెడ్డి, బి.వెంకటేశ్వర్లు, బి.గీతాంజలి

**కంపోజింగ్ & డిజైనింగ్**
ఎన్. రమాదేవి

**కన్సల్టెంట్:** కె.రఘురామరాజు



మా చిరునామా
**మహిళా సాధికారత**
ఏపిమాస్ కార్యాలయం,
ప్లాట్ నెం.20, రోడ్ నెం.2,
బంజారాహిల్స్, హైదరాబాదు-34.
ఫోన్:040 23547952/27,
ఫాక్స్ : 23547926


## చందాదారులకు ప్రత్యేక రాయితీ

'మహిళాసాధికారత' పత్రికను ఎక్కువ సంఖ్యలో తెప్పించు కోగోరే సంఘాలు, సమాఖ్యలు, సంస్థలు, వ్యక్తులకు ప్రత్యేక రాయితీ యివ్వాలని సంకల్పించాము. కనీసం సంవత్సరం పాటు ప్రతినెల 25 కాపీలకు తగ్గకుండా తెప్పించుకునే వారికి ఈ రాయితీ వర్తిస్తుంది. 25 కాపీలకంటే తక్కువగా కావాలనుకునే వారికి సాధారణ చందారేట్లు వర్తిస్తాయి.

| చందావివరాలు | ఏడాదికి | రెండేళ్ళకు | మూడేళ్ళకు |
|---|---|---|---|
| ప్రత్యేక రాయితీ చందా (25 కాపీలకు తగ్గకుండా) | 80 | 140 | 200 |
| సాధారణ చందా | 110 | 200 | 280 |

## మహిళాసాధికారత ప్రకటన ఛార్జీలు

| | |
|---|---|
| మల్టీకలర్ బాక్ కవర్‌పేజి | రూ॥10,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్‌పేజి | రూ॥6,000 |
| బ్లాక్ అండ్ వైట్ పూర్తి పేజి | రూ॥3,000 |
| బ్లాక్ అండ్ వైట్ 1/2 పేజి | రూ॥2,000 |

---

**గమనిక** : చందాలు,లేదా ప్రకటనలకోసం పంపే చెక్కులు, డిడిలను '**ఏపిమాస్-హైదరాబాద్**' పేరుమీద మాత్రమే పంపాలి

---

## ఏపిమాస్ సలహా సంప్రతింపుల సంఘం సభ్యులు, మహిళా సాధికారత పత్రిక రథ సారథులు

యాదమ్మ(రంగారెడ్డిజిల్లా), పోచవ్వ(నిజామాబాద్), సుశీలమ్మ(అనంతపురం), సంపూర్ణ (వరంగల్లు), ఓ.జ్యోతి(ఖమ్మం), కె.లలితకుమారి(శ్రీకాకుళం), కె.బంగారమ్మ(విజయనగరం), వి. అండాళు(నల్లగొండ), జి.నాగార్జునమ్మ(కర్నూలు), సాజిదాబేగం(హైదరాబాదు), కిరణ్‌కుమారి(గుంటూరు), ఈశ్వరమ్మ(నెల్లూరు), సుజాతమ్మ (మహబూబ్‌నగర్), కె.రాజేశ్వరమ్మ(ప్రకాశం) మరియమ్మ(కృష్ణా),టి.కృష్ణవేణి (పశ్చిమగోదావరి), భారతి(మెదక్), రమాప్రభాకర్(విశాఖపట్టణం), ఎస్.హఫీజా(అర్బన్-గుంతకల్లు)

**విలువతెలియనివారు దానిని వొట్టి గాజుపూస అని చెప్పినా, రత్నం విలువ తరగదు**

# ఎం ఎఫ్ ఐ లను నియంత్రించాలి, లేదా మూసివేయాలి

## తీరు మార్చుకోకుంటే, సూక్ష్మ రుణాలు మాకు వద్దు

## తేల్చిచెప్పిన స్వయంసహాయ సంఘాల ప్రతినిధుల రాష్ట్ర సదస్సు

– జె.వి. క్రిష్ణమూర్తి

**అ**ధిక వడ్డీలతో, బలవంతపు వసూళ్ళతో,అసభ్యంగా, కర్కశంగా సూక్ష్మరుణ( మైక్రో ఫైనాన్స్) సంస్థలు సాగించిన వేధింపులు,ఆగడాలు; పర్యవసానంగా 50 మందికి పైగా నిస్సహాయ నిరుపేదలు తమ ప్రాణాలను బలిపెట్టిన దారుణ సంఘటనలు, ఆ రుణగ్రహీతల గుండెలను ఎంతగా గాయ పరిచాయంటే, ఎంతగా బేజారెత్తించాయంటే, ప్రాణాంతక మైన "ఈ సూక్ష్మ రుణాలు ఇక మాకు వద్దేవద్దు, మీకు చేతనైతే వాటిని నియంత్రించండి లేదా వాటిని రద్దు చేయండి " అని వారు ముక్త కంఠంతో ప్రభుత్వానికి ఏకరువు పెట్టారు. వారి మనస్సులలో సూక్ష్మ రుణ సంస్థల పట్ల భయం, అనుమానం ఎంతగా గూడుకట్టుకున్నాయంటే, 'ఎం ఎఫ్ ఐ లు తమ తీరు మార్చుకుంటే, సూక్ష్మరుణం మీకు సమ్మతమేనా?' అని ప్రశ్నిస్తే, " వాళ్ళు మారరు " అని ఠకీమని సమాధానం చెప్పేంత ! "వాటివల్ల మేలుకంటె కీడే ఎక్కువ" అని క్షణాలలో నిగ్గుతేల్చేంత ! వారు, తమ ఈ ప్రతిస్పందనలను రాష్ట్రవ్యాప్తంగా, స్వయం సహాయ మహిళా సంఘాలు, సమాఖ్యలకు చెందిన 150 మందికి పైగా ప్రతినిధులు పాల్గొన్న చర్చావేదికలో వినిపించారు. ఇంతేకాదు, సూక్ష్మ రుణ సంస్థల తీరుతెన్నులకు సంబంధించిన అనేక అంశాలపై, నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా తమ మనసులోని మాటలను వెల్లడించారు.



ఈ సదస్సు హైదరాబాదులో 2010 డిసెంబర్ 11 వ తేదీన జరిగింది. మన రాష్ట్రంలోను, జాతీయ స్థాయిలోను స్వయం సహాయ రంగాన్ని బలోపేతం చేయడానికి దాదాపు దశాబ్దంగా ఎంతగానో కృషిచేస్తున్న సుప్రసిద్ధ స్వచ్ఛంద సంస్థ ఏపిమాస్, స్వయంసహాయ స్వయం నియంత్రణ ఉద్యమంలో తన భాగస్వామి అయిన డిజిఆర్వి ( జర్మనీ)తో కలసి ఈ చర్చావేదికను నిర్వహించింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఈ చర్చావేదిక నిర్వహణలో తన సహకారం అందించింది, మన రాష్ట్రంలోని మొత్తం 23 జిల్లాలకుగాను, సూక్ష్మ రుణ సంస్థల ప్రభావం ఎక్కువగా వున్న 13 జిల్లాలనుంచి స్వయం సహాయ మహిళలు ఈ సదస్సులో పాల్గొన్నారు.

మన రాష్ట్రంలో ఇటీవల, రుణ గ్రహీతల వరుస మరణాలతో, సూక్ష్మరుణ రంగంలో అల్లకల్లోలం తలెత్తిన నేపథ్యంలో, ఆ సంస్థలను కొంతమేరకైనా నియంత్రించడం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకుని వచ్చింది. అదేవిధంగా, ఈ మైక్రో ఫైనాన్స్ పరిణామాలపై అధ్యయనం చేయడానికి శ్రీ వై. హెచ్. మాలెగం అధ్యక్షతన రిజర్వ్ బ్యాంకి ఒక కమిటీని నియమించింది. ఈ కమిటి డిసెంబర్ 16 న హైదరాబాదులో తన అధ్యయనం సందర్భంగా, ఈ పరిణామాలపై ఏపిమాస్‌ను కూడా నివేదిక సమర్పించవలసిందిగా ఆహ్వానించింది. అందువల్ల, సూక్ష్మ రుణ గ్రహీతలలో అధిక సంఖ్యలో వున్న స్వయం సహాయ సంఘాల మహిళలతోనే నేరుగా చర్చిస్తే, వాస్తవ పరిస్థితి

**మనిషికి చదువే రూపం, గుణం, గురువు, బంధువు, దైవం, సర్వం**

వెల్లడవుతుందని; ఏ సలహాలు, సూచనలు చేయాలన్నావారే తగినవారని భావించి, ఏపిమాస్ ఈ సదస్సును నిర్వహిం చింది. ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు, సి ఇ ఓ శ్రీ సి. ఎస్. రెడ్డి సమన్వయకర్తలుగా నిర్వహించిన ఈ చర్చావేదికలో, వివిధ జిల్లాలనుంచి వచ్చిన 150 మందికి పైగా స్వయం సహాయ మహిళా ప్రతినిధులు; ఏపిమాస్, సెర్ప్ సంస్థలకు చెందిన కొందరు సిబ్బందితో పాటు, సెర్ప్ సి ఇ ఓ శ్రీ రాజశేఖర్ కూడా కొంతసేపు పాల్గొన్నారు.

ఈ సదస్సును నిర్వహిస్తున్న ఉద్దేశాన్ని గురించి తొలుత శ్రీ సి. ఎస్.రెడ్డి క్లుప్తంగా వివరిస్తూ, మన రాష్ట్రంలో సూక్ష్మ రుణ సంస్థల కారణంగా ఇటీవల తలెత్తిన అల్లకల్లోలాన్ని దృష్టిలో వుంచుకుని ఈ చర్చావేదికను నిర్వహిస్తున్నామని, ఈ చర్చలో పాల్గొంటున్నవారు ఎంఎఫ్ఐల వల్ల తమకు లేదా తమ తోటిసభ్యులకు కలిగిన అనుభవాలను, ఎం ఎఫ్ ఐ ల పనితీరుకు సంబంధించిన వాస్త వాలను, ఎంఎఫ్ఐలను నియం త్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌లోని అంశాలపట్ల తమ అభిప్రాయా లను నిస్సంకోచంగా వెల్లడించ డానికి ఈ వేదికను ఉపయోగించుకోవాలని ఆహ్వానించారు. మన రాష్ట్రంలో సూక్ష్మరుణ సంస్థలవల్ల తలెత్తిన సంక్షోభంపై అధ్యయనం చేయడానికి శ్రీ మాలెగం అధ్యక్షతన రిజర్వ్ బ్యాంకి ఒక కమిటీని నియమించిందని, ఆ కమిటీ ఈ సంక్షోభ కారణాలు, నివారణోపాయాలపై ఏపిమాస్‌నుంచి కూడా నివేదికను ఆహ్వానించిందని, ఈ చర్చావేదికలో సభ్యులు తెలియజేసే అభిప్రాయాలను ఆ నివేదికలో పొందుపరుస్తామని శ్రీ సి ఎస్ రెడ్డి వివరించారు. సమా వేశంలో చర్చజరిగే తీరు గురించి శ్రీ రెడ్డి తెలియజేస్తూ, ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావుగారు ప్రశ్నలరూపంలో చర్చను నిర్వహిస్తారని, చర్చలో అందరూపాల్గొనవచ్చునని, అయితే, పాల్గొనదలచినవారు చెయ్యియెత్తి తాము మాట్లా డాలనుకుంటున్నట్లు సూచించడం; ఒకరి తర్వాత ఒకరుగా క్లుప్తంగా, స్పష్టంగా మాట్లాడడం; వేరొకరు వ్యక్తంచేసే అభి ప్రాయం తమ అభిప్రాయానికి భిన్నంగావున్నా పరస్పర గౌరవం పాటిస్తూ , శ్రద్ధగా విని ప్రతిస్పందించడం వంటి సాధారణమైన సభానియమాలను పాటించాలని సూచిం చారు. అందుకు సభ్యులందరూ తమ ఆమోదం తెలియజేశారు.



అనంతరం, ఏపిమాస్ ఛైర్మన్ శ్రీ కె. మాధవరావు చర్చను ప్రారంభిస్తూ. తాను ఇటీవల తమ గ్రామానికి వెళ్ళినపుడు అక్కడ కొందరు స్వయంసహాయ సంఘాల సభ్యులతో మాట్లాడానని, వారుకూడా మైక్రో ఫైనాన్స్ సంస్థలవద్ద అప్పులు తీసుకున్నవారేనని, మైక్రో ఫైనాన్స్ సంస్థలు ఇస్తున్న అప్పులగురించి వారు విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేశారని పేర్కొన్నారు. వడ్డీ మీద వడ్డీతో చక్రవడ్డీలు వేసి, ముక్కుపిండి వసూలు చేసే ఒకనాటి ఫక్తు వడ్డీ వ్యాపారుల్లా మైక్రో ఫైనాన్స్ సంస్థలు వ్యవహరిస్తున్నా యని కొందరు అంటు న్నారు; ఇంకొందరేమో, మైక్రో ఫైనాన్స్ సంస్థలు కనీసం అవసరానికి అప్పులు ఇస్తున్నాయి, బ్యాంకులకంటే మేలేకదా అంటున్నారు; మరికొందరేమో, మైక్రో ఫైనాన్స్ సంస్థల రాకతో ప్రభుత్వం ఏర్పాటుచేసిన గ్రూపులు దెబ్బ తింటున్నాయి కాబట్టి, ఆ వైఫల్యంనుంచి దృష్టి మళ్ళించడం కోసం, అనవసరంగా సూక్ష్మ రుణ సంస్థలను ఆడిపోసు కుంటున్నారు అని...ఇలా రకరకాల అభిప్రాయాలు వెలి బుచ్చుతున్నారు. ఇందువల్ల, రాష్ట్రం నలుమూలలనుంచి ఈ సదస్సులో పాల్గొంటున్న స్వయంసహాయ మహిళా ప్రతినిధులు మైక్రో ఫైనాన్స్ సంస్థల తీరుతెన్నులగురించి, వాటిని నియంత్రించడానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌లోని అంశాలగురించి తాను అడిగే ప్రశ్నలకు ఎలాంటి సంకోచంలేకుండా, నిర్మొహమాటంగా తమ అభిప్రాయాలను తెలియజేయవలసిందిగా ఆయన కోరారు.

**సంక్షోభసమయంలోనే ముసుగులు వీడిపోతాయి, అసలు రంగులు బైటపడతాయి**

శ్రీ మాధవరావు అడిగిన ప్రశ్నలు, వాటికి చర్చలోపాల్గొన్న సభ్యుల సమాధానాలు ఇవి:

## ప్రశ్నలు-సమాధానాలు

**1. స్వయం సహాయ సభ్యులు ఒకే గ్రూపులో వుండాలా లేక అనేక సంఘాలలో వుండవచ్చా?**

*జ: ఒకే గ్రూపులో వుండాలని చాలామంది చెప్పారు. ఆయితే, నిజామాబాద్ జిల్లా కామారెడ్డి, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రాంతాల ప్రతినిధులు డబ్బు చెల్లించే తాహత్తు వుంటే, ఎక్కువ గ్రూపులలో సభ్యత్వం వున్నా తప్పేమీ లేదన్నారు.*

**2. ఎం ఎఫ్ ఐ ల ఏజెంట్లు నేరుగా ఇళ్ళకు వచ్చి వసూలు చేయడాన్ని మీరు సమర్థిస్తారా, లేకపోతే ఎక్కడ వసూలుచేయాలని మీరంటారు?**

*జ: ఇళ్ళవద్ద వసూళ్ళు వద్దేవద్దని సభ్యులందరూ ఒక్కుమ్మడిగా చెప్పారు. అప్పు వసూలుకు తగిన ప్రదేశాలుగా పంచాయతీ కార్యాలయం, గ్రామసంఘం కార్యాలయం, పాఠశాల, గుడి మొదలైన సూచనలు వచ్చాయి. అయితే, పంచా యతీ కార్యాలయంలో ఎక్కువగా మగవారు వుంటారుకాబట్టి అక్కడవద్దని కొందరు అభ్యంతరం చెప్పారు.*

**3. సూక్ష్మ రుణ సంస్థలు పేదలకు, నిరుపేదలకు అప్పులు ఇస్తున్నాయా?**

*జ: లేదు అనే సమాధానమే సభ్యులనుంచి వచ్చింది. ఆస్తులు వున్నవారికి, పూచీకత్తు చూపించగలిగినవారికి మాత్రమే సూక్ష్మరుణసంస్థలు అప్పులు ఇస్తాయని వారు వివరించారు.*

**4. అప్పులు ఇవ్వడంకాకుండా, ఎం ఎఫ్ ఐ లు మీనుంచి పొదుపులు లేదా డిపాజిట్లు ఏమైనా వసూలు చేస్తున్నాయా? అలా వసూలుచేస్తే , వాటిపై మీకు వడ్డీ చెల్లిస్తున్నారా?**

*జ: పొదుపులు లేదా డిపాజిట్లు వసూలుచేయడం లేదని చాలామంది చెప్పారు. కాని, భీమవరం, హైదరాబాదులోని ఉప్పల్ ప్రాంతాల ప్రతినిధులు మాత్రం కొన్ని ఎంఎఫ్ఐలు పొదుపులు కట్టించుకుంటున్నాయని, అయితే, అ పొదుపు మొత్తాలపై ఎలాంటి వడ్డీ చెల్లించడం లేదని చెప్పారు.*

**5. మీకు సంఘాలలో తగినంత అప్పు దొరకకపోవడంవల్లనే ఎం ఎఫ్ ఐలవద్దకు వెడుతున్నారా?**

*జ: అవును; సంఘాలు, బ్యాంకులు తగినంత అప్పు ఇవ్వకపోవడంవల్లనే, మరో మార్గంలేక ఎం ఎఫ్ ఐలవద్ద అప్పు తీసుకుంటున్నామని చాలామంది చెప్పారు*

**6. ఎం ఎఫ్ ఐ లు మీవద్దనుంచి ఎంత వడ్డీ వసూలు చేస్తున్నాయో మీకు అవగాహన వుందా ?**

*జ: 80 శాతం మందికి పైగా, తమకు అవగాహన లేదని చెప్పారు. అయితే, తాము వడ్డీ చాలా ఎక్కువగానే చెల్లిస్తున్నామని దాదాపు అందరూ పేర్కొన్నారు.*

**7. హామీలు, పూచీకత్తులు లేకుండా ఎం ఎఫ్ ఐలు అప్పులు ఇస్తాయా?**

*జ:హామీలు,పూచీకత్తులు లేకుండా ఎంఎఫ్ఐలు అప్పు ఇవ్వనే ఇవ్వవని దాదాపు అందరూ మూకుమ్మడిగా చెప్పారు. స్టాంపు పేపర్లమీదసంతకాలు తీసుకుంటున్నారని కొందరు అంటే; ఇంటి దస్తావేజులు, రేషన్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డుల వంటివి తీసుకుంటున్నారని మరికొందరు చెప్పారు.*

**8. ఎం ఎఫ్ ఐ లు అప్పులు వసూలుచేసుకునే తీరు మహిళలకు ఇబ్బందికరంగా వుంటున్నదా?**

*జ: చాలా ఇబ్బందికరంగా వుంటున్నదన్నది మూడువంతుల మంది సమాధానం. ఏ కారణంవల్లనైనా ఒక్క వాయిదా చెల్లించలేకపోయినా, అప్పు వసూలు సమయంలో వారు ఎంతో కటువుగా, అవమానకరంగా ప్రవర్తిస్తారని, నలుగురిలో పరువు తీస్తారని, వీటిని తట్టుకోలేకనే కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని వారు వాపోయారు. అయితే, భీమవరం ప్రాంతానికి చెందిన సభ్యులు మాత్రం, అప్పు ఇచ్చేటప్పుడే వారు ఈ విషయాలన్నీ చెప్పారని , అందువల్ల ఇందులో వారి తప్పేమీ లేదని అన్నారు.*

**9. ఎం ఎఫ్ ఐ లు మీకుటుంబాలను అప్పుల ఊబిలోకి నెట్టాయని మీరనుకుంటున్నారా?**

*జ: దాదాపు 90 శాతం మందినుంచి అవుననే సమాధానమే వచ్చింది. ఎక్కువ అప్పులు తీసుకునేలా ప్రేరేపిస్తారని కూడా వారు చెప్పారు.*

**10. ఎం ఎఫ్ ఐ ల అప్పులవల్ల, సంఘాలకు, బ్యాంకులకు చెల్లించవలసిన బకాయిలు ఆగిపోతున్నాయా?**

**ఎక్కువ మంది మీద ఆధారపడ్డావా, నీకు నిరాశ తప్పదు**

*జ: అవును నిజమేనని దాదాపు అందరూ అంగీకరించారు. సంఘాలలో ఒక వాయిదా కట్టకపోయినా, సభ్యుల సమ్మతితో ఆ సొమ్ము మరుసటి నెల కట్టే వెసులుబాటు వుంటుందని, ఎంఎఫ్ఐలలో అలా కుదరదని, అందువల్ల ఎంఎఫ్ఐలకు చెల్లిస్తూ, సంఘాలకు, బ్యాంకులకు బకాయి పడుతున్నారని వారు వివరించారు.*

**11. ఎం ఎఫ్ ఐ లు తాము పేదల ఆదాయాన్ని పెంచడానికి, పేదల బతుకులను బాగు చేయడానికే వచ్చామంటున్నాయి; మరి మీరేమంటారు?**

*జ: ఎం ఎఫ్ ఐలు తమ ఆదాయాన్ని ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడానికే చూస్తున్నాయి తప్ప పేదల బాగుకోసం ఎంతమాత్రం కాదని దాదాపు అందరూ పేర్కొన్నారు. రకరకాలుగా వేధిస్తూ, అవమానిస్తూ, ఆఖరుకు ఆత్మహత్యలకు కూడా ప్రేరేపిస్తుంటే పేదలపట్ల సానుభూతి అనే మాటకు ఆస్కారం ఎక్కడిదని వారు ప్రశ్నించారు.*



**12. సంఘాలలో పుస్తక నిర్వహణ, అప్పుపై అవగాహన మొదలైన విషయాలకు సంబంధించి ఏపిమాస్, సెర్ప్ ఇస్తున్న శిక్షణల మాదిరిగానే, ఎం ఎఫ్ ఐ లుకూడా రుణ గ్రహీతలకు ఏవైనా శిక్షణలు ఇస్తున్నాయా?**

*జ: ఎలాంటి శిక్షణలు ఇవ్వడంలేదని అందరూ ఒక్కుమ్మడిగా చెప్పారు*

**13. అప్పులు ఇవ్వడం కాకుండా, ఎం ఎఫ్ ఐ లు రుణగ్రహీతలకు మరేవైనా సేవలు అందిస్తున్నాయా? సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా కృషిచేయడం, పిల్లల చదువులు, ఆరోగ్యం, సారా నిషేధం వంటి సామాజిక సమస్యలపై ఏమైనా అవగాహన కలిగిస్తున్నాయా?**

*జ: ఇన్స్యూరెన్స్ కట్టించుకుంటున్నారని దాదాపు అందరూ చెప్పారు. సెల్ ఫోన్, వాటర్ ఫిల్టర్ లాంటివి ఇస్తారని, అప్పు తీసుకున్న వ్యక్తి చనిపోతే మిగతా అప్పు మాఫీ అవుతుందని కొందరు పేర్కొన్నారు. సంఘాలలో మాదిరిగా మహిళాభ్యున్నతికి సంబంధించిన కార్యక్రమాలు, సామాజిక కార్యక్రమాలేవీ వుండవని చాలామంది చెప్పారు.*

**14. అప్పుగా తీసుకున్న సొమ్మును కుటుంబ ఆదాయం పెంపు వంటి పనులకోసం సద్వినియోగం చేసుకోవాలని ఎం ఎఫ్ ఐ లు ఏవైనా సలహాలు, సూచనలు ఇస్తున్నాయా? అప్పు వినియోగం తీరుపై వారి పర్యవేక్షణ ఏమైనా వుంటున్నదా?**

*జ: అప్పు ఇచ్చే సమయంలో, అప్పు ఎందుకోసం తీసుకుంటున్నారని మాత్రమే అడుగుతారని, అంతకుమించి అప్పు వినియోగాన్ని గురించి సలహాలు ఇవ్వడంకాని, పర్యవేక్షణ కానీ ఏదీ వుండదని చాలామంది చెప్పారు. నిజానికి ఆ విషయాలలో వారు ఎలాంటి ఆసక్తి చూపరని, వాయిదాలు దాటకుండా వడ్డీతో వసూలు చేసుకోవడంలో మాత్రమే వారు ఆసక్తి చూపుతారని సభ్యులు పేర్కొన్నారు.*

**15. మైక్రో ఫైనాన్స్ సంస్థల వల్ల మేలుకంటె కీడు ఎక్కువ అని కొందరు అంటున్నారు, మీ అభిప్రాయమేమిటి?**

*జ: 60 శాతం మందికి పైగా అవును అని సమాధానం చెప్పారు. తాము బకాయి పడ్డామని 17 ఏళ్ళ వయసువున్న తమ అమ్మాయిని తీసుకుపోయి ఆరుగంటలపాటు గ్రామపంచాయతీలో నిలబెట్టారని, ఆ అవమానం తట్టుకోలేక ఆ అమ్మాయి తాను ఆత్మహత్యచేసుకుంటున్నానని రాసి, విషంతాగి మరణించిందని ఒక సభ్యురాలు గొల్లుమన్నది. అందువల్ల ఈ సంస్థలవల్ల మేలుకంటె కీడే ఎక్కువ అని వారు పేర్కొన్నారు. ఇలా దౌర్జన్యం చేస్తున్నారని ఒక సంస్థను గతంలో కలెక్టర్ మూయించారని, అయితే ఇక ముందు అలా చేయమని హామీ ఇచ్చి మళ్ళీ సంస్థ కార్యకలాపాలను ప్రారంభించిన సంవత్సరంలోనే తిరిగి ఇంత దారుణానికి ఒడిగట్టారని వారు వాపోయారు.*

**నమ్మకంతో అడుగేస్తే సాధించినట్టే - అనుమానంతో ఊగిసలాడితే చతికిలబడినట్టే**

**16.ఎం ఎఫ్ ఐ లు అప్పుతీసుకున్న వారిని వేధిస్తున్నా యంటున్నారు కదా, మరి స్వయం సహాయ సంఘాలో లేదా వాటి సమాఖ్యలో సభ్యులకు అండగా నిలవడంలేదా? కలసికట్టుగా వారిని ఎదిరిస్తే ఇలాంటి దారుణాలకు ఆస్కారం వుండదుకదా?**

*జ: తాము తమ గ్రామంలో సర్పంచ్, ఎంపిటిసిల తోడ్పాటుతో ఎంఎఫ్ఐల వారిని ఊళ్ళో అడుగు పెట్టనివ్వ కుండా అడ్డుకున్నామని మెదక్ జిల్లా జైరాబాద్ ప్రతినిధులు చెప్పారు. మా ఊళ్ళో ఎం ఎఫ్ ఐ అప్పులు ఇవ్వవద్దని హెచ్చరిస్తే, వారు తమ ఊరి సభ్యులను పొరుగూరికి పిలి పించుకుని అప్పులు ఇస్తున్నారని చిత్తూరు జిల్లాకు చెందిన కొందరు తెలిపారు. ఎం ఎఫ్ఐ ల వద్ద అప్పు తీసు కోవద్దని, అలా తీసుకుంటే సంఘ సభ్యత్వం కోల్పో తారని తాము హెచ్చ రిస్తున్నా, మాకు వారు అప్పులు ఇస్తున్నారు కాబట్టి అక్కడికి వెడుతున్నామని, అవసరమైతే సభ్యత్వం వదులుకోవడానికైనా తాము సిద్ధమేనని సభ్యులు అంటున్నారని హైదరాబాద్‌లోని ఉప్పల్ ప్రతినిధులు పేర్కొన్నారు.*



*తమ సంఘ సభ్యురాలొకరు ఎం ఎఫ్ ఐ ల నుంచి లక్ష రూపాయలు అప్పుతీసుకుని చెల్లించలేక, వారి ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యకు సిద్ధమైందని, ఆ సంగతి పసిగట్టి తాము ఆమెను ఓదార్చి, గ్రామసంఘం తోడ్పాటుతో ఆ సభ్యురాలి అప్పు తీర్చి, నిబంధనల ప్రకారం సులభ వాయిదా లలో ఆ సభ్యురాలు గ్రామ సంఘానికి చెల్లించేలా ఏర్పాటుచేశామని మెదక్ జిల్లాకు చెందిన ఒక గ్రామసంఘం ప్రతినిధులు చెప్పారు.*

**17. వడ్డీ తగ్గించుకుంటే తాము తమ సంస్థలను మూసివేయవలసి వస్తుందని ఎం ఎఫ్ ఐ లు అంటున్నాయి, మీరేమంటారు?**

*జ: "వాళ్ళు వడ్డీ తగ్గించి తీరవలసిందే ; వాళ్ళు పద్ధతులు మార్చుకోవలసిందే ; లేకుంటే వాళ్ళు మాకు వద్దు " అని అందరూ ఒక్కుమ్మడిగా సమాధానం చెప్పారు*

**18. మైక్రో ఫైనాన్స్ సంస్థలు మారితే మాత్రమే వారి నుంచి అప్పులు తీసుకుంటామని అంటారా?**

*జ: వాళ్ళు మారనే మారరు అని ఆందరూ ఠకీమని సమాధానం చెప్పారు*

**19. ఎం ఎఫ్ ఐ సంస్థల కార్యకలాపాలను కొనసాగ నివ్వాలా, వద్దా ? కొనసాగనివ్వాలంటే వారు ఏవైనా నిబంధనలను పాటించాలని మీరు సూచిస్తారా?**

*జ: ఎం ఎఫ్ ఐ ల వల్ల మేలుకంటె కీడే ఎక్కువ అంటూ, చాలామంది సభ్యు లు వాటిని మూసి వేయాలని కోరారు. కొద్దిమంది మాత్రం, ఎం ఎఫ్ ఐ లు తమ విధానాలను సవ రించుకుంటే వాటిని కొనసాగించవచ్చునని ఈ క్రింది సూచనలు చేశారు.*

- *వడ్డీ తగ్గించాలి, వీలుంటే రూపాయి వడ్డీకే అప్పు ఇవ్వాలి*
- *వసూలు పద్ధతులు మార్చుకోవాలి, వేధింపులు మానుకోవాలి*
- *ఎక్కువ అప్పులు ఇస్తామంటూ సభ్యులను ఆకర్షించ కూడదు; వారిని తీర్చలేని అప్పుల ఊబిలోనికి నెట్టకూడదు*
- *అప్పు ఇచ్చేముందే ఆ ఎంఎఫ్ఐ అనుసరించే అన్ని నిబంధనలు, నియమాలు, పద్ధతులను గురించి సభ్యు లకు స్పష్టంగా వివరించాలి. తిరిగి చెల్లించే స్థోమతను బట్టి అప్పులివ్వడం, అప్పును సద్వినియోగం చేసుకునే తీరునుగురించి అవగాహన కల్పించడం అవసరం.*

**చదువుకున్న పడుచు, అన్నింటా ముందునడుచు**

**20. ఎం ఎఫ్ ఐ లు నేరుగా సభ్యులకు అప్పులు ఇవ్వడం కాకుండా, బ్యాంకుల మాదిరిగానే చిన్న సంఘాలకు లేదా గ్రామ సంఘాలకు, సమాఖ్యలకు అప్పు ఇస్తే మంచిదంటారా?**

*జ: అలా చేయడం మంచిదేనని, సంఘాలను విడగొట్ట కుండా, వసూళ్ళలో వేధింపులకు తావులేకుండా సంఘాలకే అప్పులు ఇవ్వడం మంచిదేనని చాలామంది పేర్కొన్నారు.*

*ఈ ప్రశ్నలు, సమాధానాల గోష్ఠి అనంతరం సభ్యులందరూ నాలుగు చిన్న బృందాలుగా విడిపోయి ఈ అంశాలపై మరింత విస్తృతంగా చర్చించారు. ఆ చర్చలలో ఈ క్రింది సూచనలు వచ్చాయి.*

- *ఎం ఎఫ్ ఐ ల వేధింపుల కారణంగా మరణాలు సంభవించిన కుటుంబాలకు ఆ ఎం ఎఫ్ ఐ లు తగినంత ఆర్థిక సహాయం అందించాలి*
- *హామీలు, పూచీకత్తులతో నిమిత్తం లేకుండా పేదలకు అప్పులు ఇవ్వాలి*
- *అప్పు కాలపరిమితికి అంతా ఒకే రకమైన వడ్డీ (ఫ్లాట్ రేట్ ) కాకుండా, అసలు మొత్తం తగ్గుదలకు అను గుణంగా వడ్డీ వసూలుచేయాలి*
- *సభ్యుల ఇళ్ళవద్ద కాకుండా, గ్రామ సంఘ కార్యాలయం, గుడి వంటి బహిరంగ ప్రదేశాలలోనే అప్పు వసూలు చేయాలి*
- *వారం వారం వసూళ్ళు కాకుండా నెల వసూళ్ళు వుండాలి*
- *అప్పు వసూలుచేసే ప్రదేశంలో, వడ్డీ రేట్లు, నెలవారీ వాయిదా మొత్తం వంటి వివరాలను ప్రదర్శించాలి*
- *సులువైన వడ్డీ తప్ప ఎలాంటి అదనపు ఛార్జీలు వుండకూడదు*
- *అప్పును బీమాచేయిస్తే ఆ వివరాలు సభ్యులకు స్పష్టంగా వివరించాలి*
- *సభ్యులనుంచి పొదుపులు లేదా డిపాజిట్లు వసూలుచేస్తే వాటిపై వారికి వడ్డీ చెల్లించాలి*
- *అవసరాలను, అప్పు చెల్లింపు సామర్థ్యాన్ని మించి అప్పులు తీసుకునే విధంగా సభ్యులను ప్రోత్సహించకూడదు*

చిన్న బృందాలు తమ చర్చల సారాంశాన్ని వివరించిన అనంతరం, సెర్ప్ సి ఇ ఓ శ్రీ రాజశేఖర్ ప్రసంగిస్తూ, ఎం ఎఫ్ ఐ ల వేధింపులవల్ల సంభవించిన మరణాల గురించి ఆవేదన వ్యక్తంచేస్తూ, ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ ఈ రకమైన వేధింపులకు అడ్డుకట్ట వేయ గలుగుతుందని, అలా వేధించేవారికి లక్ష రూపాయల వరకు జరిమానా, మూడేళ్ళ జైలు శిక్ష విధించే అవకాశాన్ని ఈ ఆర్డినెన్స్ కల్పిస్తున్నదని చెప్పారు.

ఇంతేకాకుండా అప్పు వసూలు విషయంలోకూడా, కుటుంబ ఆదాయంలో 60 % కుటుంబ ఖర్చులకోసం ప్రత్యేకించి, మిగతా 40 % లోనే వసూళ్ళు చేయవలసి వుంటుందని నిబంధన వున్నట్టు తెలిపారు. సభ్యులు చేసిన సూచనలపై శ్రీ రాజశేఖర్ స్పందిస్తూ, బ్యాంకులు స్వయంసహాయ సంఘాలకు సకాలంలో అప్పులు ఇచ్చే విధంగా, సెర్ప్ కృషిచేస్తున్నదని, “నగదు, అప్పు పరిమితి” (క్యాష్ క్రెడిట్ లిమిట్) ప్రాతిపదికన బ్యాంకులు అప్పులు ఇచ్చేలా చూస్తున్నామని, ముందుగా 20 సమాఖ్యలలో ఈ “నగదు, అప్పు పరిమితి” సూత్రాన్ని వర్తింపజేస్తామని చెప్పారు.

ఇంతేకాకుండా, సభ్యుల ఆదాయం పెంపొందించే కార్యక్రమాలనుకూడా సెర్ప్ మరింతగా చేపట్టనున్నదని, సంఘాలు సుస్థిర ప్రగతి సాధించే విధంగా వారి నైపుణ్యా లను , సామర్థ్యాలను పెంపొందించే అన్ని రకాల శిక్షణలను సమకూర్చడం జరుగుతుందనికూడా శ్రీ రాజశేఖర్ పేర్కొన్నారు.

సెర్ప్ ఎస్ పి ఎం జమున గారు, ఎంఎఫ్ ఐ ల దురాగతాలను సభ్యులు సంఘటితంగా అడ్డుకోవాలంటూ క్లుప్తంగా ప్రసంగించిన అనంతరం శ్రీ సి ఎస్ రెడ్డి వందన సమర్పణతో ఈ సదస్సు ముగిసింది.

❐

**కూలికెళ్తే పూటగడుస్తుంది, బడికెళ్తే జీవితం నడుస్తుంది**

# ఆర్థిక చేకూర్పులో అయోమయం-సంఘాల భవితవ్యం ప్రశ్నార్థకం

**బ్యాం**కింగ్ సేవలు ప్రతి కుటుంబానికి అందించాలన్నదే 'సంపూర్ణ ఆర్థిక చేకూర్పు' ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా, ప్రతి కుటుంబానికి సంబంధిత బ్యాంకులో పొదుపు ఖాతా ప్రారంభించాలని బ్యాంకు మేనేజర్లు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు. మన రాష్ట్రంలో ఇందిరా క్రాంతి పథం ద్వారా స్వయం సహాయ సంఘాల ఉద్యమం బలంగా వుండడంవల్ల, ప్రతి గ్రామసంఘానికి ఒక సముదాయ కార్యకర్త (సిఎ) వుండడంవల్ల , బ్యాంకు మేనేజర్లు సి.ఎ.లకు టార్గెట్లు ఇచ్చి, గుర్తింపు కార్డులు తీసుకొని ప్రారంభ నగదు లేకుండా కొంతమంది మేనేజర్లు ఖాతాలు ప్రారంభిస్తుండగా, రూ.250/-, రూ.500/-ల చొప్పున ప్రారంభనిల్వగా కట్టించుకుని మరికొంతమంది మేనేజర్లు తమ బ్యాంకులలో ఖాతాలు ప్రారంభిస్తున్నారు. ఈక్రమంలో బ్యాంకులలో ఖాతాలు ప్రారంభించడానికి 'ఇందిరాక్రాంతి' సిబ్బందిని, గ్రామాలలోని చురుకైన సంఘసభ్యులను వినియోగించుకుని అధిక సంఖ్యలో ఖాతాలు ప్రారంబిస్తున్నారు.

బ్యాంకు లింకేజికి వచ్చిన ప్రతి సంఘ సభ్యురాలికి, బ్యాంకులో ఖాతా వుంటేనే లోను ఇస్తామని మేనేజర్లు ఒత్తిడి చేస్తుండడంవల్ల, కొందరు సభ్యులు తమకు ఇష్టం లేకపోయినా లోనుకోసం ఖాతాను ప్రారంభిస్తున్నారు.

**వ్యక్తిగత ఖాతాల వలన ప్రభుత్వం ఆశిస్తున్నదేమిటి?**

సమాజంలో ప్రతి కుటుంబం బ్యాంకులో పొదుపు ఖాతా ప్రారంభించి, వారిదగ్గర అప్పుడప్పుడు వున్న మిగులును బ్యాంకులో దాచుకొని, అవసరమైనపుడు ఆ సొమ్ముతో వారి అవసరాలు తీర్చుకుంటారని ప్రభుత్వం ఆశించింది. గ్రామాలలో సాధారణంగా అప్పుడప్పుడు వస్తున్న మిగులును పేదకుటుంబాలవారు డబ్బాలలోను, పెట్టెలలోను దాచి పెట్టుకుంటారు. అందువలన నగదు అందుబాటులో వుండడంవల్ల ఒక్కొక్కసారి అనవసరమైన ఖర్చులుపెట్టి, అవసరానికి నగదులేక అప్పులపాలు అవుతుంటారు. అందువల్ల, మిగులు నగదును బ్యాంకులో దాచిపెడితే, అవసరాలకు అనుగుణంగా వినియోగించుకొని అప్పులపాలుకాకుండా పేదలు జీవిస్తారని ప్రభుత్వం భావించింది. ప్రభుత్వ విధానాలు, సర్క్యులర్‌లో స్పష్టంగా వున్నాయి కాని, ఆచరణలోమాత్రం ప్రజలమనస్సులకు ఎక్కలేక పోతున్నాయి.

**బ్యాంకులు అనుసరిస్తున్న పద్ధతులు**

బ్యాంకు పరిధిలోగల కుటుంబాలనన్నింటినీ ఒకేసారి ఖాతాలలోకి తేవాలన్న లక్ష్యంతో మేనేజర్లు అనేకరకాలుగా ఒత్తిడి తెస్తున్నారు.

1. బ్యాంకులో వ్యక్తిగతఖాతా వుంటేనే లింకేజి ఇస్తామని చెప్పడం
2. ఇందిరాక్రాంతి సిబ్బందికి, సిఎలకు టార్గెట్ ఇచ్చి ప్రారంభించాలని ఒత్తిడి తేవడం.
3. ఖాతాల సంఖ్య ఎక్కువగా వుంటే మీ బ్యాంక్‌కు అంత మంచిది అని చెప్పడం

**అనుసరించదగిన పద్ధతులు**

1. ప్రతి మండల, గ్రామ సమాఖ్య, సంఘ సమావేశాలలో వ్యక్తిగత ఖాతాల ప్రాముఖ్యాన్ని తెలియజేయడం.
2. బ్యాంకు పరిధిలోని అన్ని పేదకుటుంబాలను ఒకేసారి అని కాకుండా, అంచెలంచెలుగా నమోదుచేసి వుంటే బాగుండేది.
3. ముందుగా ఖాతాలు ప్రారంభించి , బ్యాంకి సేవలను పొందుతున్నవారి ద్వారా మిగతా సభ్యులకు అవగాహన కలిగించివుండవలసింది.
4. ఖాతాలను ప్రారంభించాలని ముందుకు వచ్చిన వారితోనే ఖాతాలు ప్రారంభించాలి.
5. బలవంతంగా ఒప్పించి ఖాతాలు ప్రారంభించకూడదు.

**బలవంతపు ఖాతాల ఫలితం ?**

లీడరు వెళ్ళి డబ్బు తెచ్చుకోవాలని చూస్తే , అసలు విషయం బయటపడంది. పొదుపుసొమ్ము అప్పుకు జమ అయిందని బ్యాంకులో తెలియజేశారు. ఫలితంగా,

**అసూయతో అపజయం, ఆత్రంతో నష్టం**

# నిరంతర ఉచిత న్యాయసహాయం అందించే ఆదర్శనారీమణి

– ఎ.వి.రాజా

ఇతరులు మనకు ఏమి చేశామన్నది ముఖ్యం కాదు, మనం ఇతరులకు ఏమి చేశామన్నది ముఖ్యం. అలాగే మనం ఈ ప్రపంచంలోనికి ఎలా ప్రవేశించామన్నది ముఖ్యంకాదు, ఎలా నిష్క్రమించామన్నది ముఖ్యం. మన నిష్క్రమణ తరువాత, చిరస్థాయిగా సంఘం మనలను గుర్తించుకున్న నాడు, మనం ఈ లోకంలో లేకపోయినా మన జీవితాలు చరితార్ధమవుతాయి. ఈవిధమైన ఆదర్శాలతో, తమకోసం తాము బతకడంకంటె సమాజ సంక్షేమంకోసం జీవితం గడిపేవారు చాలా అరుదుగా వుంటారు.

అటువంటి అరుదైన వ్యక్తులలో ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న శ్రీమతి ఎ.వేంకటేశ్వరి ఒకరు! ఆమె ఒక ప్రసంగవాహిని! అరుదైన ఆత్మీయతతో, ఛలోక్తుల జల్లులతో, బాధితులకు అండగా తానున్నానని ధైర్యం చెబుతూ, ఆశాకిరణాలను ప్రసరింపజేస్తున్నది. ఆమె అలుపెరుగని నిరంతర శ్రామికురాలు, నిగర్వి, న్యాయదేవత ముంగిట వాక్ప్రజ్ఞాశాలి.

టివి-5 ఛానల్‌లో గత ఒకటిన్నర సంవత్సరంగా ప్రతి ఆదివారం మధ్యాహ్నం 2.30కు ప్రసారమయ్యే 'స్నేహిత' కార్యక్రమంలో, హైకోర్టుకు చెందిన మరొక న్యాయవాది శ్రీ శ్రీధర్‌తో కలిసి 'వరకట్న' కేసులు, ఫలితంగా ఏర్పడుతున్న దుష్పరిణామాలు, వారి పిల్లల సమస్యలకు సంబంధించిన పరిష్కారాలపై చేసే సూచనల కోసం, 'స్నేహిత' కార్యక్రమం కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తుంటారు. అలాగే బాధితమహిళలు పేదవారై, న్యాయసహాయం వారికి అందుబాటులో లేకపోతే అన్యాయానికి బలౌతున్న అలాంటి మహిళలకు శ్రీమతి ఎ.వేంకటేశ్వరి ఉచితంగా న్యాయ సహాయం చేయడం అభినందనీయం! ఇంతేకాకుండా, ప్రతి శనివారం ఉదయం 10గంటల నుండి హైకోర్టులో కొందరు న్యాయమూర్తులతో పాటు బాధితుల సహాయార్థం ఏర్పడిన 'లీగల్‌సెల్ అథారిటీ'లో బాధితులకు న్యాయసలహాలు ఇస్తూ, ఉపశమనం కలిగిస్తుండడం మరో ప్రశంసనీయమైన విషయం. ఈ న్యాయ సలహాల కార్యక్రమంలో సాయంత్రం 4గంటలవరకు పాల్గొని, మళ్ళీ దాదాపు వెంటనే, సాయంత్రం 5 గంటల నుండి, మరొక టివి. ఛానల్‌లో ఇద్దరు రిటైర్డ్ జడ్జీలతో న్యాయసలహాల కార్యక్రమంలో పాల్గొంటారు శ్రీమతి ఎ.వెంకటేశ్వరి.

హైకోర్టు న్యాయవాదిగా ఉదయంనుండి రాత్రి పది గంటల వరకు కూడా బాధిత మహిళలకు న్యాయం చేయడం కోసం ఈమాదిరిగా అనేక కార్యక్రమాలలో నిత్యం అవిశ్రాంతంగా కృషిచేస్తున్న ఆదర్శ మహిళ శ్రీమతి ఎ.వెంకటేశ్వరి. ఆమె సేవా తత్పరతకు ఇవే అభినందనాంజలులు. ❒

---

పొదుపులు కడితే అప్పుకు జమచేసుకుంటారన్న భయంతో, మిగిలిన సభ్యులు సంఘ సమావేశాలకు హాజరుకాలేదు. ఫలితంగా సంఘం ఆగిపోయింది.

మరొక విషయం ఏమిటంటే, కంతుల నిర్ణయం కూడా మేనేజరును బట్టి వుంటుంది. ఉదా : ఇండియన్ బ్యాంక్, రాయలపేటలో టిఎఫ్ఐ క్రింద మంజూరు చేసిన మొత్తాలకు మేనేజరు 60 కంతులుగా నిర్ణయించారు. ఆయన బదిలీ కాగా, తరువాత వచ్చిన మేనేజరు 36 కంతులలో కట్టమని ఒత్తిడి చేశారు. ఫలితంగా సంఘ సభ్యులలో బ్యాంకులంటేనే భయం పట్టుకుంటున్నది.

మరొకవైపు ఎంఎఫ్ఐల అధిక వడ్డీకోరల్లో చిక్కుకుని పేదలు బలియైపోతున్నారు. ఇటువంటి తరుణంలో రాష్ట్రస్థాయిలో చర్చలు జరగాలి.

కంతుల నిర్ణయంలోను, తిరిగి చెల్లింపుల విధానంలోను ఏకాభిప్రాయసాధన జరగాలి. సక్రమంగా తిరిగి చెల్లింపులు జరిగే రీతిలో, పటిష్ట విధానం తీసుకొని రావాలి. లోను తీసుకొనేటపుడు సంఘ సభ్యులకందరికీ అప్పుల సద్వినియోగంపైన శిక్షణ ఇవ్వాలి; తిరిగి చెల్లింపులపై పర్యవేక్షణ ఉండాలి. ❒

**సద్భావనతో కూడిన మాటే మంత్రం**

# అవివాహిత కుమార్తెకు జీవితాంతం పింఛను

సర్వీసు పింఛనుదారు, అతని లేదా ఆమె భాగస్వామి కూడా చనిపోయినపుడు కుటుంబ సభ్యుల్లో ఎవరికి పింఛను ఇవ్వాలన్న నిబంధనల్లో ప్రభుత్వం కొన్ని మార్పులు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం... అవివాహిత కుమార్తె కొన్ని నిబంధనలకు లోబడి, ఇక జీవితాంతం కుటుంబ పింఛను పొందవచ్చు. ఆమెకు పాతికేళ్ళ వయస్సు వచ్చేవరకు మాత్రమే పింఛను ఇవ్వాలంటూ, ఇప్పటివరకూ ఉన్న నిబంధనలో సవరణ చోటుచేసుకుంది. అలాగే వితంతు లేదా విడాకులు పొందిన కుమార్తెకు ఇతరత్రా నెలకు రూ. 2440 మించి ఆదాయం ఉంటే, కుటుంబ పింఛనును నిలిపివేయాలన్న నిబంధననుకూడా స్వల్పంగా మార్చారు.

ఇలా నిర్ణీతమొత్తం అనికాకుండా కరవుభృతితో కలిపిన కనీస కుటుంబపింఛను మొత్తాన్ని మించినస్థాయిలో ఆదాయం లభించేవరకూ ఇక ఆమెకు పింఛను లభిస్తుంది. కుటుంబ పింఛనులో ఇటువంటి కొన్ని మార్పులను తెస్తూ ఆర్థికశాఖ ఉత్తర్వు (నెం. 315) వెలువరించింది. వివిధ పింఛనుదారుల సంఘాల నుంచి వచ్చిన అభ్యర్థనలను, కేంద్ర ప్రభుత్వ పింఛను మార్గదర్శకాలను పరిగణనలోకి తీసుకొని 9వ వేతనసవరణసంఘం(పీఆర్సీ)చేసిన సిఫార్సులకు అనుగుణంగా ఈ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ పింఛనుదారు మృతి చెందితే అతని / ఆమె కుటుంబ సభ్యులకు ఇచ్చేదే కుటుంబపింఛను. కుటుంబ పింఛనకు అర్హులను ప్రభుత్వం తాజాగా రెండు రకాలుగా వర్గీకరించింది.

- ◆ వితంతువు,విడోవర్‌కు మృతిలేదా తిరిగి వివాహం ఏది ముందైతే అంతవరకు కుటుంబపింఛను అందుతుంది.
- ◆ కుమారుడు, కుమార్తె (వితంతు కుమార్తెతో సహా)కు వివాహం, పునర్ వివాహం, లేదా వారు సంపాదన మొదలు పెట్టిన తేదీ, లేదా 25 ఏళ్ళ వయస్సు... వీటిలో ఏది ముందైతే అంతవరకు.
- ◆ కుమారుడు / కుమార్తె శారీరక లేదా మానసిక వైకల్యం కలిగి వుంటే వారికి కొన్ని నిబంధనలకు లోబడి జీవితాంతం పింఛను అందుతుంది.

**రెండో వర్గీకరణ**

- ◆ ఒకటో వర్గీకరణ పరిధిలోకి రాని అవివాహిత, విధురుడు, విడాకులు పొందిన కుమార్తెకు వివాహం లేదా ఆర్జన ప్రారంభం, లేదా మృతి – ఏది ముందైతే అంతవరకు పింఛను లభిస్తుంది.
- ◆ ఉద్యోగి బతికిఉన్నప్పుడు అతనిపై ఆధారపడిన తల్లిదండ్రులు పింఛనుకు అర్హులు. అయితే మృతిచెందిన ఉద్యోగికి వితంతువు, పిల్లలు ఉండకూడదు. తల్లిదండ్రులకు కుటుంబ పింఛను వారి మరణం వరకు లభిస్తుంది.
- ◆ సంతానానికి కుటుంబ పింఛను వారి పుట్టిన తేదీని అనుసరించి అందుతుంది. వీరిలో పెద్దవారు పింఛనుకు అనర్హులు కానంత కాలం చిన్నవాళ్ళు పింఛనుకు అర్హులుకారు.
- ◆ కరవుభృతితోసహా కనీసకుటుంబపింఛను ఎంతైతే ఉంటుందో ఆ మొత్తం ఆదాయ పరిమితిగా మారుతుంది.
- ◆ పిల్లలు లేని వితంతువు పునర్ వివాహం చేసుకొన్నప్పటికీకొన్ని నిబంధనలకులోబడి పింఛను అందుతుంది. ఎప్పటికప్పుడు ప్రకటించే కనీస కుటుంబ పింఛనుతో ఆమె ఇతర ఆదాయం సమానంగా ఉన్నా, అంతకంటే మించినా పింఛను నిలిచిపోతుంది. పిల్లలులేని వితంతువు తన ఇతర ఆదాయానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాన్ని ప్రతి ఆరు నెలలకోసారి అందజేయాలి.
- ◆ కుమార్తె – వితంతువు కావటం, విడాకులు పొందటం అనేది ఇక ఉద్యోగిపదవీవిరమణ తర్వాతాలేక అంతకు ముందా అన్నదిచూడరు. 2004లో జీవో 523, అలాగే 2008లో జీవో నెం 231 వెలువడడానికిముందు,ఆ తర్వాత పదవీవిరమణ చేసిన వారికి ఇలా వర్తిస్తుంది
- ◆ పింఛనుదారుల సహభాగస్వామి మృతిచెంది, కుమారులు,కుమార్తెలు ఒకటో వర్గీకరణ ప్రకారం అనర్హులై వితంతు/విడాకులు పొందిన కుమార్తె కుటుంబ పింఛనుకు అర్హులైతే అప్పుడు కుటుంబ పింఛనుకోసం తగిన సాక్ష్యాధారాలతో ప్రతిపాదనలు పంపాలి.

**(ఈనాడు సౌజన్యంతో)**

**శ్రద్ధవుంటే అన్నీ వున్నట్టే, అదే లేకుంటే ఏదీ లేనట్టే**

# గ్రామ పేదరికాన్ని రూపుమాపిన మహిళా చైతన్యం

– బి.గీతాంజలి

**క**ర్ణాటక రాష్ట్రంలోని కెంకర అనే గ్రామంలో మహిళలు అందరూ కలసి వారి గ్రామాన్ని వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచుకుని విజయవంతంగా ముందడుగు వేస్తున్నారు. ఎన్నో ఆటుపోట్లు వచ్చినా తట్టుకుని, అందరి భాగస్వామ్యంతో తమ పిల్లల జీవితాల్ని తీర్చిదిద్దుతున్నారు.

ఈ గ్రామంలో మొత్తం 85 కుటుంబాలున్నాయి. వీరు 5 స్వయంసహాయ సంఘాలుగా ఏర్పాటు అయ్యారు. సక్రమంగా పొదుపులు, సమావేశాలు నిర్వహించు కుంటున్నారు. సంఘం సమావేశాలతో చర్చలద్వారా వచ్చిన అవగాహనతో, ఆలోచనతో తమ గ్రామాన్ని తీర్చిదిద్దు కోవలసిన అవసరాన్ని వారు గుర్తించారు. ముఖ్యంగా, తమ గ్రామంలోని కుటుంబాలన్నీ ఎందుకు పేదరికంలో ఉన్నాయో వారు చర్చించారు. పేదరికంనుంచి తామంతా బయటపడ డానికి తమకు ఎలాంటి పరిష్కార మార్గాలు అందుబాటులో ఉన్నాయో ఆలోచన చేసి, వాటిని ఆచరణలో పెట్టారు. ఉదాహరణకు, ఆ గ్రామంలో అందరూ కూలీచేసి బ్రతికేవాళ్ళే. కొంత పొలంఉన్నా, నీటివసతి లేక సంవత్సరానికి ఒక పంట తో సరిపెట్టుకుంటూ వచ్చారు. కుటుంబాలలో మగవారు తాము సంపాదించుకున్న కూలీ డబ్బులను సారాకి ఖర్చుపెట్టి, మహిళలను కొట్టేవారు. ఊళ్ళో గొడవలు షరా మామూలే. పరిస్థితి ఇలానే కొనసాగితే తమ పిల్లలుకూడా ఇలానే తయా రవుతారని, తాము, తమపిల్లలు ఇక ఎప్పటికీ పేదరికంనుండి బయటపడలేవని వారు ఆలో చించారు. ఏవిధంగా వుంటే బాగుంటుందో అందరూ కలసి 'కల కన్నారు'.

**వారి కల**

1. సంఘాలు సభ్యులందరినీ ఆదుకునేవిధంగా సుస్థిరంగా ఉండాలి, మంచి ఆదాయాన్ని పొందగలగాలి.
2. గ్రామమంతా, అన్నివీధులు మురికినీళ్ళు, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉండాలి.
3. అందరికీ పౌష్టికాహారం లభించాలి.
4. ప్రతి కుటుంబ ఆదాయం పెరగాలి.
5. పర్యావరణాన్ని కాపాడుకోవాలి

పై కలను నిజం చేసుకోవడానికి గత 7 సంవత్సరాలుగా వారు కలసికట్టుగా కృషిచేస్తూ విజయపథంలో వెడుతున్నారు. ఈ సంఘాలు ఎవరికోసమో ఎదురుచూడకుండా, తమకు అవసరమైనవాటిని తామే సాధించుకో గలుగుతున్నారు.

బ్యాంకులు కూడా సంఘాలకు అవసరమైనంత అప్పులు ఇస్తున్నాయి. బయటినుండి తెచ్చే అప్పులను కేవలం జీవనోపాధుల పెంపుదలకు మాత్రమే ఉపయోగించుకోవాలనే నిబంధనను అందరూ కచ్చితంగా పాటిస్తున్నారు. సద్వినియోగమవుతున్న ఈ అప్పులు సభ్యుల కుటుంబాలలో ఆదాయాన్ని, నిజమైన ఆనందాన్ని నింపుతున్నాయి. వారి కుటుంబ అవసరాలకు కావలసిన అప్పులను సంఘంలో, సమాఖ్యలో(ఫెడరేషన్‌లో) తీసుకుంటున్నారు.

**సంఘాలు తెచ్చిన చైతన్యం..సాధించిన గ్రామాభివృద్ధి**

1. ఊళ్ళో సారాషాపు లేకుండా చేశారు. సారా అమ్మే వ్యక్తికి మరోమంచి జీవనోపాధి కల్పించారు.(కిరాణాషాపు పెట్టించారు.సంఘంలో అప్పుఇచ్చి పొలంకొనిపించారు)
2. తమ పొలంలో సంవత్సరం పొడవునా పంట వేసు కుంటూ మంచి ఆదాయాన్ని సమకూర్చుకుంటున్నారు.
3.. పాడిగేదెలద్వారా ఆదాయం సమకూర్చుకుంటున్నారు.
4. ప్రతి ఇంటికి ఇంకుడుగుంత తవ్వుకున్నారు.
5. ప్రతి ఇంటిలో పెరటితోటను పెంచి తమకు కావలసిన కూరగాయలను, పండ్లను వారే పండించుకుంటున్నారు.
6. ప్రతి ఇంటిలో పొగలేని పొయ్యిని ఏర్పాటుచేసుకుని, వంట యింటిని పరిశుభ్రంగా వుంచుకుంటున్నారు.
7. గ్రామంలోని పాఠశాలలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేదుకకు, రిపబ్లిక్ దినోత్సవ వేడుకకు తమ పిల్లలతో పాటు ప్రతి తల్లితండ్రి హాజరవుతారు.
8. తమ పెరటితోటలలో పండిన కూరగాయలను స్కూలు పిల్లలకు మధ్యాహ్న భోజనం కోసం ఇస్తారు.

**కాలానికి నీవు విలువ యివ్వకపోతే కాలమూనీకు విలువ యివ్వదు**

9. సంఘాల ఆదాయంలో కొంత భాగాన్ని స్కూలు పిల్లల భోజనం, ప్లేటులు, గ్లాసులకోసం విరాళంగా ఇచ్చారు.
10. రూ.10,000/- పెట్టుబడితో సంఘాల మీటింగుల కోసం చక్కని ఆఫీసుగదిని నిర్మించుకున్నారు.

## ఆలోచనవుంటే పొలం సస్య శ్యామలం

పొలం సరిగా పండక, వ్యవసాయం లాభసాటిగాలేక ఊళ్ళకు ఊళ్ళు వలస వెళ్ళడం, రైతులు ఆత్మహత్యలు చేసుకోవడం వంటి వార్తలను పత్రికలలో తరచు చూస్తుంటాం. నిజమే, రైతుల కష్టాలు అక్షర సత్యాలు. ఈ పరిస్థితి వల్ల తరతరాలుగా ఆ కుటుంబాలు పేదరికంలోనే మగ్గిపోతున్నాయి. కుటుంబాల వలసలవల్ల ముసలివాళ్ళకు ఆదరణ లేక, చిన్నపిల్లలకు ఆలనాపాలనా, చదువులేక ఎన్నో అవస్థలకు గురి అవుతున్నారు. ఎన్ని అప్పులు ఇచ్చినా వారి ఈ కష్టాలు తీరేనా అనే అనుమానం పీడిస్తుంది. మరి వీటికి పరిష్కారమే లేదా అంటే, పరిష్కారం ఉంది అని ఘంటా పథంగా చెబుతారు తిమ్మయ్యగారు. ఆయన కూడా 10 సంవత్సరాల క్రితం కూలీనే. 'పరిష్కారం ఎక్కడా లేదు మన ఆలోచనల్లో ఉంది. పనికిరాని భూములంటూ ఏవీ ఉండవు; సరిగా ఉపయోగించుకోని భూములు ఉంటాయి. మన ఆలోచనల్లో బలముంటే, మన పొలం సస్యశ్యామలం అవుతుంది' అంటారు తిమ్మయ్య.

తిమ్మయ్యకు 4 ఎకరాల మెట్టభూమి మాత్రమే ఉంది. ఈ మెట్టభూమిలో సంవత్సరానికి కేవలం ఒక పంట వేసే వారు. పంట వస్తే వస్తుంది, లేదంటే లేదు. ఊళ్ళో అన్ని కుటుంబాలదీ దాదాపు ఇదే పరిస్థితి. పంటరూపంలో వచ్చే ఆ కొద్దిపాటి ఆదాయంపోను మిగిలిన సంవత్సరమంతా తినడానికి తిండికూడా కరువే. అందుకే, మొత్తం ఊరు ఊరంతా వలసవెళ్ళేవారు. ఆ పరిస్థితి నుండి ప్రస్తుతం 10 సంవత్సరాలుగా ఆ ఊరి వాళ్ళు వలస వెళ్ళడం లేదు. పచ్చని చెట్లతో, చక్కని ఆదాయంతో ఆ ఊరు ఒక పచ్చని కుటుంబం లా ఉంది. అందుకే ఆ ఊరివారు సంవత్సరానికి ఒకసారి పచ్చని పండుగ (గ్రీన్ ఫెస్టివల్) ను జరుపు కుంటారు. ఈ పండుగ ఏమంటే, సంవత్సరానికి ఒకరోజు ప్రతి కుటుంబం ఒక చెట్టు నాటి, దాని ఆలనాపాలనా వారే చూడాలి.

కేవలం పదేళ్ళలో ఇంత గొప్ప మార్పు ఎలా సాధ్యమైందనే దానికి నిదర్శనం తిమ్మయ్య. తన పొలంలో పనే తనకు ఊపిరిఆడనంతగా ఉంటోంది అంటారు తిమ్మయ్య. తిమ్మయ్య అనుసరించిన ఆ అద్భుతమైన పద్ధతేమిటో చూద్దాం.

1. తిమ్మయ్య తన పొలం చుట్టూ జీవకంచె ఏర్పాటు చేసుకున్నాడు. జీవకంచె అంటే పచ్చని చెట్లనే కంచె లాగా ఏర్పాటుచేసుకోవడం. ఈ జీవకంచె, అటు పొలాన్ని కాపాడడంతో పాటు, ఇటు అదనపు ఆదాయాన్ని, పశువులకు మేతను అందిస్తుంది.
2. ఈ జీవకంచె పేదవారికి ఇన్సూరెన్స్ లాంటిది. 15 సంవత్సరాలలో ఒక్కొక్క చెట్టు వెరైటీనిబట్టి రూ.5000 నుండి రూ.10000 వరకు ఆదాయం ఇస్తుంది. ఎన్ని చెట్లు ఉంటే ఆ రైతుకు అంత ఆదాయం వస్తుంది. పొలానికి ఎరువుగా, పశువులకు మేతగా ఆకులు ఉపయోగపడతాయి.
3. తిమ్మయ్య పొలంలో జీడిమామిడి, మామిడి, పనస, కొబ్బరి వంటి పండ్లచెట్లు, చింతచెట్లు ఉన్నాయి. వీటిమధ్యలో రాగులు, కందులు, జొన్నలు, మినుములు, ఆముదాలు, ఉలవలు, నువ్వులు, ఆనపకాయలు, అలసందలులాంటి పంటలలో ఏవో కొన్నిటిని సంవత్సరమంతా పండిస్తుంటాడు.
4. కొబ్బరి చెట్లద్వారానే సంవత్సరానికి రూ.60,000/- లాభం వస్తుంది.
5. ప్రతి నెల ఏదో ఒక పంట ద్వారా ఆదాయం వస్తూనే ఉంటుంది.
6. తన పొలంలో వర్మీకంపోస్టు ఎరువును మాత్రమే ఉపయోగిస్తాడు. ఎరువును అమ్ముతారు కూడా. తనే వర్మీ కంపోస్టు ఎరువు తయారుచేస్తాడు. దీనిద్వారా మంచి ఆదాయం కూడా వస్తోంది.

ఇలా తన పొలంలో సంవత్సరం మొత్తం పంట పండిస్తుండడం వల్ల, ఇంటిల్లిపాదికీ పని దొరుకుతుంటుంది. పాడి గేదెల ద్వారా మరికొంత ఆదాయం వస్తోంది. పిల్లలు, పెద్దలు మంచి జీవనప్రమాణాలతో ఎవరిపై ఆధారపడకుండా జీవిస్తున్నారు.

❐

**ఎన్నో గొప్ప ఆలోచనలకు మౌనమే జన్మ భూమి**

# రద్దు బాటలో డీసీసీబీలు

## రాష్ట్రంలో రెండంచెల సహకార వ్యవస్థ : వాణిజ్య బ్యాంకులుగా మారనున్న 'ప్యాక్స్'

సహకారవ్యవస్థలో భారీ మార్పులు తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రెండంచెల సహకార వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు కసరత్తు మొదలుపెట్టింది. ఇది ఓ కొలిక్కివస్తే ఒకప్పుడు ఒక వెలుగు వెలిగి, ఆతర్వాత ప్రాభవాన్ని కోల్పోయిన జిల్లాసహకార కేంద్ర బ్యాంకులు (డీసీసీబీ లు) పూర్తిగా అదృశ్యం కానున్నాయి.

రాష్ట్రంలో ప్రస్తుతం మూడంచెల సహకార వ్యవస్థ ఉంది. కిందిస్థాయిలో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (ప్యాక్స్) జిల్లాస్థాయిలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు (డీసీసీబీ) రాష్ట్రస్థాయిలో ఆంధ్రప్రదేశ్ సహకారబ్యాంకు (ఆప్కాబ్) ఉన్నాయి. రాష్ట్రంలో సహకార వ్యవస్థ బలంగాఉన్న రోజుల్లో డీసీసీబీలకు ఎనలేని ప్రాధాన్యం ఉండేది. ముఖ్యంగా 1980లలో డీసీసీబీలు శక్తిమంతంగా పనిచేశాయి.

ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన తర్వాత సహకార వ్యవస్థ తన ప్రాభవాన్ని కోల్పోవడం మొదలైంది. ఇక 1995 తర్వాత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించిన విధానాల మూలంగా రాష్ట్రంలో సహకార రంగం కుదేలైంది. డీసీసీబీలు రాజకీయ పునరావాస కేంద్రాలుగా మారాయి. ప్యాక్స్ పరిస్థితి అంతకంటే దయనీయంగా తయారైంది. ఒకప్పుడు సుమారు 10వేల దాకా ఉన్న ప్యాక్స్ సంఖ్య 2792కు పడిపోయింది. ఉన్న సొసైటీల్లోనూ చాలావరకు బలహీనంగా తయారయ్యా యి. ఈ నేపథ్యంలో వైద్యనాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం రెండేళ్ళ కిందట కేంద్రం ప్రత్యేక ప్యాకేజీని ప్రకటించింది. ఈ నిధు లను ఉపయోగించి వైద్యనాథన్ సిఫారసుల మేరకు సహకార వ్యవస్థలో భారీ సంస్కరణలు తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న వ్యవస్థ ప్రకారం – ఆప్కాబ్‌కు నాబార్డు రుణం మంజూరు చేస్తుంది. ఈ రుణ మొత్తాన్ని ఆప్కాబ్ ఆయా జిల్లాల డీసీసీబీలకు పంపిణీ చేస్తుంది. అక్కడినుంచి ప్యాక్స్‌కు నిధులు మంజూరవుతాయి. ఆ నిధులను క్షేత్రస్థాయిలో ప్యాక్స్ రైతులకు రుణాలుగా అందిస్తాయి. వెరసి... ఇన్ని చేతులు మారిన తర్వాతే రైతులకు రుణం అందుతోంది. ఈక్రమంలో ఆప్కాబ్, ప్యాక్స్‌మధ్య ఉన్న డీసీసీబీ ప్రాధాన్యం, వాటి అవసరంపై ప్రశ్నలు తలెత్తాయి. ఉదాహరణకు, ప్రతి వాణిజ్య బ్యాంకుకు ఒక ప్రధాన కార్యాలయం ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఆ బ్యాంకు శాఖలు ఉంటాయి. మధ్యలో డీసీసీబీ తరహా వ్యవస్థలు ఉండవు. ఈవిధానంలోనే వాణిజ్య బ్యాంకులు వందల, వేల కోట్ల రూపాయల లావాదేవీలు నిర్వహిస్తున్నాయి. పైగా... లాభాల బాటలో ప్రయాణిస్తున్నాయి. మరి... సహకార రంగంలో డీసీసీబీలు ఎందుకు ఉండాలనే ప్రశ్న తలెత్తింది.

సంస్కరణల్లో భాగంగా డీసీసీబీలనురద్దుచేసి, రెండంచెల సహకార వ్యవస్థను తీసుకురావడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. డీసీసీబీలవల్ల ప్రయోజనం పెద్దగా కనిపించడం లేదు. వాటిలో వ్యాపారలావాదేవీలుకూడా ఆశించినమేర జర గడంలేదు. పైగా నిర్వహణఖర్చులు పెరిగిపోతున్నాయి. ఇప్ప టికే కుదేలైన సహకారరంగానికి ఇదిఅదనపుభారంగా మారిం ది. ఈనేపథ్యంలో డీసీసీబీలను రద్దుచేసి, వాణిజ్యబ్యాంకుల తరహా వ్యవస్థను ప్రవేశపెట్టడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది సహకార బ్యాంకులు కూడా వాణిజ్యబ్యాంకుల తరహాలో పని చేయాలనేది వైద్యనాథన్ సిఫారసుల ప్రధాన లక్ష్యం. దీని ప్రకారం క్షేత్రస్థాయిలో పనిచేసే ప్యాక్స్‌నే పూర్తిస్థాయి వాణిజ్యబ్యాంకులుగా మార్చాలని భావిస్తున్నారు. వీటిని బలో పేతంచేసి, కంప్యూటరీకరించి, క్రియాశీలంగా మార్చి నేరు గా ఆప్కాబ్‌తోనే అనుసంధానించే దిశగా ప్రయత్నిస్తున్నారు.

ప్రస్తుతం రాష్ట్రంలో 22 డీసీసీబీలు ఉన్నాయి. ఒక్కో డీసీసీబీ పాలక మండలిలో ఒక ఛైర్మన్, సుమారు 10 నుంచి 15 మంది డైరక్టర్లు ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీసీసీబీల్లో 22 ఛైర్మన్ పదవులు, 220నుంచి300వరకు డైరక్టర్ల పదవులు ఉన్నాయి. డీసీసీబీలను రద్దుచేస్తే, ఈ పదవులు కూడా మాయ మవు తాయి. అందువల్ల దీనిపై స్థానిక నేతల నుంచి తీవ్రంగా వ్యతిరేకత వచ్చే అవకాశం వుందనికూడా భావిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

**నిటారుగా నిలవాలనుకుంటే నీ సొంత కాళ్ళనే నమ్ముకో**

# 'మైక్రో' సంస్థలకు అప్పులు ఆపవద్దని రిజర్వ్ బ్యాంకి సలహా

**బ్యాం**కుల నుంచి భారీ మొత్తంలో అప్పులుగా తీసుకున్న మైక్రో ఫైనాన్స్ సంస్థలు చేతులెత్తేసే పరిస్థితి కనిపిస్తుండడంతో ఆర్‌బిఐ ఆందోళన పడుతున్నది. మైక్రో ఫైనాన్స్ సంస్థలకు రుణవితరణ నిలిపివేయవద్దని ఆర్‌బిఐ బ్యాంకులకు సూచించింది. ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిణామాల కారణంగా మైక్రో ఫైనాన్స్ సంస్థలు భారీ ఎత్తున ఎగవేతల సమస్యను ఎదుర్కొంటున్నాయి. ఇదే పరిస్థితి ఇతర రాష్ట్రాలకు కూడా విస్తరించే అవకాశం వుందని మైక్రో ఫైనాన్స్ సంస్థలు గగ్గోలు పెడుతున్నాయి.

అప్పులు వసూలు కాకపోవడంతో పాటు బ్యాంకుల నుంచి ఫైనాన్స్ ఆగిపోవడంతో మైక్రోఫైనాన్స్ సంస్థలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన ఆర్‌బిఐ, మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ కుప్పకూలితే, బ్యాంకులు కూడా భారీ ఎత్తున నష్టపోవాల్సి వస్తుందన్న ఆందోళనతో ఫైనాన్స్‌ను కొనసాగించాల్సిందిగా బ్యాంకులకు సూచించింది. బ్యాంకర్లు 22.12.10 న ఆర్‌బిఐతో సమావేశమై, మైక్రోఫైనాన్స్ సంస్థల పరిస్థితిని వివరించారు. మైక్రో ఫైనాన్స్ వ్యవస్థ ప్రాధాన్యత తమకు బాగా తెలుసని ఈ వ్యవస్థ పూర్తిగా కూలిపోయేవరకు చూస్తూ కూచోవడం మంచిది కాదన్న ఉద్దేశంతో తాము సమావేశమై చర్చించినట్టు ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ కె.రామకృష్ణన్ తెలిపారు.

నవంబర్ వరకు బ్యాంకులకు మైక్రో ఫైనాన్స్ సంస్థల నుంచి డిఫాల్ట్ ఎదురుకాలేదని; అయితే, ముందుముందు పరిస్థితి మాత్రం క్లిష్టంగానే కనిపిస్తున్నదని బ్యాంకర్లు పేర్కొన్నారు. సమస్యకు తాత్కాలిక పరిష్కారాన్ని కనుగొనవలసిందిగా బ్యాంకర్లు ఆర్‌బిఐని కోరారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల రుణాల రీషెడ్యూలింగ్‌కు అనుమతించాలని కూడా ఆర్‌బిఐని వారు కోరారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సమస్య ఇతర రాష్ట్రాలకు విస్తరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గతంలో విమానయాన పరిశ్రమకు సంబంధించిన రుణాల రీషెడ్యూలింగ్‌కు అనుసరించిన విధానాన్నే మైక్రో ఫైనాన్స్ సంస్థలకు వర్తింపచేయాలని బ్యాంకర్లు అంటున్నారు. దీనికి సంబంధించిన ఒక ప్రతిపాదన కూడా వారు ఆర్‌బిఐకి సమర్పించినట్లు తెలిసింది.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# సాధించాలన్న తపనలో భారతీయ యువతులే మిన్న

**మ**నదేశంలోని మహిళల ఆకాంక్షలకు ఆకాశమే హద్దని తెలిసింది. ఉన్నత స్థానానికి చేరుకోవాలన్న వారి కోరిక ముందు అమెరికన్ మహిళలు కూడా పనికిరారని వెల్లడైంది. ఈ విషయంలో భారత్‌లో అమ్మాయిలకే దృఢసంకల్పం ఎక్కువట. అమెరికా మహిళలతో పోల్చుకుంటే భారత్ యువతుల్లోనే ఎక్కువ శాతం మందికి ఉన్నతస్థానాన్ని చేరుకోవాలనే కోరిక ఉందట. 'సెంటర్ ఫర్ వర్క్ లైఫ్ పాలసీ' అనే స్వచ్ఛంద సంస్థ చేసిన అధ్యయనం ఆధారంగా తయారైన 'ది బాటిల్ ఆఫ్ ఫిమేల్ టాలెంట్ ఇన్ ఇండియా' అనే నివేదికలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. అయితే వారికున్న అవకాశాలు మాత్రం తక్కువేనని కూడా వెల్లడించారు. ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్న తపన అమెరికా అమ్మాయిల్లో 52 శాతం మందికి మాత్రమే ఉంటే, భారత్‌లో 80 శాతం మందికి ఉందని మహిళా ప్రతిభకు సంబంధించిన నివేదిక స్పష్టం చేసింది. అయితే భారత్‌లో కేవలం 30 శాతం మంది మహిళలే ఉద్యోగాలు చేస్తుండగా, 18 నుంచి 23 ఏళ్ళ వయసున్న వారిలో 10 శాతం మంది మాత్రమే ఉన్నతవిద్యను అభ్యసిస్తున్నారు. అయినా 2009లో భారత్‌లోని సీఈవోలలో 11 శాతం మంది మహిళలే కాగా, అమెరికాలో ఆ శాతం నాలుగుగా మాత్రమే ఉంది. ఈ పరిస్థితికి కారణం ఇటీవల భారత్ ఆర్థికంగా ఎదగడమేనని, ఈ పరిస్థితి భారతీయ సమాజంలో మహిళల స్థితిగతులను మార్చివేసిందని నివేదిక పేర్కొంది. ఇంత జరిగినా, పిల్లల సంరక్షణ, లింగ వివక్ష, భద్రత, మితిమీరి పని చేయడం వంటి కారణాల వలన మహిళలు ఉద్యోగ జీవితంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయాన్ని కూడా అందులో పొందుపరిచారు. ❐

**అద్దం నీస్వరూపమేమిటో చెబుతుంది, నీ స్వభావమేమిటో నీ మిత్రులు చెబుతారు**

# విభిన్నపథంలో.... విజేతలు

**చి**న్నవయసులోనే భర్త దూరమైతే... ఒంటరి నడకతో వ్యాపార విజయం సాధించిందొకరు. పాలిథిన్ బ్యాగులకు ప్రత్యామ్నాయంగా.... కాగితం సంచులతో కాసుల బాట పట్టింది మరొకరు. పాతికమంది నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తూ.... పసందైన రుచులతో ఆదాయం సంపాదిస్తున్నది ఇంకొకరు. శ్రమ, ఓర్పు పెట్టుబడిగా.... నమ్మకం, నాణ్యత పునాదులుగా.... వ్యాపార పథంలో ముందుకు సాగుతున్న వారే.... సుభద్ర, యామిని, విజయలక్ష్మి. ఇటీవల విశాఖలో జరిగిన ఎలీప్ అంతర్జాతీయ సదస్సులో వీరు పాల్గొన్నారు. వీరి విజయ గాథలను ఈనాడు ప్రచురించింది. ఆ కథనాలను , ఈనాడు సౌజన్యంతో , మహిళా సాధికారత పాఠకులకోసం అందిస్తున్నాము.

వినియోగదారుల ఆనందమే తమ ఆనందం అంటూ సామాజిక బాధ్యతని, వ్యాపారసూత్రాన్ని మేళవించి విజయం సాధించారీ మహిళా పారిశ్రామికవేత్తలు. వందల్లో పెట్టుబడి....అలుపెరుగని శ్రమ. వెనక్కి తిరిగి చూస్తే కోట్లలో వ్యాపారం. వినియోగదారుల అవసరాలకే కాదు... ఆరోగ్యానికీ ప్రాధాన్యం ఇస్తున్నాం అంటున్నారు ఆంధ్రప్రదేశ్ మహిళా పారిశ్రామికవేత్తల సంఘం (ఎలీప్) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన అంతర్జాతీయ చర్చాగోష్ఠిలో పాల్గొనేందుకు వచ్చిన ఈ మహిళలు.

## కలబందతో కల నెరవేర్చుకున్నా....

**మూ**డొందల నెల జీతం కోసం రోజంతా పని చేసిన రోజుల నుంచి, సొంతంగా మరో ముప్ఫైమందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకొన్నారు హైదరా బాద్‌కి చెందిన సుభద్ర. 'మాది నిజామాబాద్ జిల్లా వర్ని ప్రాంతం. చిన్నవయసు లోనే భర్తను కోల్పోయాను. ఇది నా జీవితంలో అనుకోని సంఘటన. ఆ సమయంలో కుటుంబానికి నేనే ఆధారమయ్యాను. వానాకాలం చదువు.... ఐదో తరగతి కూడా పూర్తి కాలేదు. కుట్టుపని నేర్చుకున్నాను .తెల్లవారు జామున మూడుగంటలకే లేచి ఉదయం ఏడింటికల్లా ఇంటి పనులన్నీ పూర్తి చేసుకుని పిల్లల్ని బడికి పంపేదాన్ని. కేవలం రూ.300 నెల జీతానికి పని చేసేదాన్ని. చాలీచాలని ఆ జీతంతో అరకొర సౌకర్యాలు కూడా అందేవి కావు. ప్రాథమిక అవసరాలకు సైతం ఆలోచించుకోవాల్సిన పరిస్థితి. ఎలాంటి ఎదుగూబొదుగూ లేని ఈ జీవితాన్ని మలుపు తిప్పుకోవాలని, ఏదో సాధించాలని ఎప్పుడూ తపన పడేదాన్ని. కలబంద పంటకు ఉన్న గిరాకీని దృష్టిలో పెట్టుకుని మా పొలంలో ఆ పంట వేశాను. జంతువుల దాడితో చివరికి నష్టాలే మిగిలాయి. అధైర్యపడకుండా, పోయినచోటే వెతుక్కోవాలనే విజయసూత్రంతో, మళ్ళీ ప్రయత్నాలు మొదలుపెట్టాను.



కలబందని ఉత్పత్తి చేయడమే కాకుండా దానిని ఉపయోగించి సబ్బులు, సౌందర్యలేపనాలు తయారుచేయించే కర్మాగారాన్ని ఏర్పాటు చేయాలనే ఆలోచన వచ్చింది. ఏడాది పాటు ఎంతో అధ్యయనం చేసి ఆ ప్రయత్నాలు మొదలు పెట్టాను. సౌందర్య ఉత్పత్తుల తయారీలో మెలకువలు పసిగట్టాను.' శ్రీయోగ్ ఇండస్ట్రీస్ ' పేరుతో హైదరాబాద్ జీడిమెట్లలో ఆర్నెల్ల క్రితం సొంతంగా కర్మాగారాన్ని ఏర్పాటు చేశాను. అయితే ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి నాదైన శైలిని, ప్రతిభను వినియోగించాను. వీధికో వ్యక్తిని ప్రచారానికి ఉపయోగించడం వల్ల ఉత్పత్తులు త్వరగా అమ్ముడుపోయేవి. అలా వ్యాపారం అంచెలంచెలుగా విస్తరించింది. అయితే శ్రమ,ఓర్పే ఇక్కడ కీలకాంశాలు. వినియోగదారుల అవసరాల మేరకు కలబందతో పాటు గులాబీ, తేనె, తులసి వంటి వాటితో యాభై రకాల ఉత్పత్తులను అందించి రూ.కోటి పైబడి టర్నోవరు చేయగలుగుతున్నా. ఈమధ్య ప్రభుత్వమే రూ.1.5 కోట్ల ఆర్డరును అందించింది. ప్రస్తుతం నేను ముప్ఫై

**పొరపాటు సహజమంటూ దానినే అలవాటుగా మార్చుకోకు**

మందికి ఉపాధి కల్పించగలుగుతున్నాను. పూలదుకాణాల్లో వృధాగా పడిఉండే రేకులను సేకరించి, దానిని సౌందర్య సాధనాల్లో వాడుకునేందుకు త్వరలో మరో ప్రయత్నం చేయబోతున్నా' అంటూ వివరించారు సుభద్ర.

## పర్యావరణానికి పట్టం....

రోజురోజుకూ ఉధృతం అవుతున్న పాలిథిన్ సంచుల వాడకం పర్యావరణానికి...ప్రజారోగ్యానికి ఎంత చేటుగా మారుతుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకొని కాగి తంతో చేసే సంచులకు శ్రీకారం చుట్టారు యామిని కోగంటి.

"మా స్వస్థలం కృష్ణా జిల్లాలోని గుడ్లవల్లేరు. మెట్టినిల్లు హైదరాబాద్. ఎక్కడ చూసినా పాలిథిన్ సంచుల వాడకం పెరిగిపోవడంతో, పర్యావరణానికి కలుగుతున్న హాని గురించి పత్రికల్లో చదివి, పరిష్కారంగా ఏం చేస్తే బాగుంటుందా అని ఆలోచించాను. ఆ పరిస్థితి మార్చడానికి నా వంతు ప్రయత్నం చేయలేనా?... అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను.



ప్లాస్టిక్‌ను వాడకుండా కేవలం కాగితంతో సంచుల తయారీ చేపట్టాలని నిర్ణయించుకున్నా. అయితే మామూలు సంచి రూపాయికి దొరుకుతున్నప్పుడు కాగితపు సంచికి మూడు నుంచి నాలుగు వెచ్చించాలంటే ఎవరూ ముందుకు రారన్న విషయాన్ని గుర్తించాను. అందుకే చౌకగా లభ్యమయ్యే క్రాఫ్ట్ కాగితాన్ని ముడిసరకుగా వాడుతున్నాను. అరకిలో నుంచి ఏడు కిలోల బరువు మోయగలిగే ఆరువేల సంచులను ఒక గంటలో చేసేలా యూనిట్‌ను విస్తరించాను. మూడున్న రేళ్ళలో ఎన్నో కష్టాలూ పడ్డాను. సాదా రంగుల్లో చేసే సంచులపై ప్రజలు మొగ్గు చూపడం లేదని నా సృజనను ప్రయోగించి తరచూ డిజైన్లు మార్చేదాన్ని. ఆయా సందర్భాలకు తగ్గట్టుగా వారివారి పేర్లను సంచులపై ముద్రించే ఏర్పాటు చేశా. ప్రజల్లో పర్యావరణ స్పృహ పెరిగితే మాలాంటి ఔత్సాహిక వ్యాపారులకు ఢోకా ఉండదు. ప్రధానంగా అంతర్జాలం ఉపయోగించుకుంటూ మార్కెటింగ్ చేస్తున్నాను. నాదగ్గర పనిచేస్తున్న వారిలో పన్నెండుమంది గ్రామీణ మహిళలే అంటున్నారు యామిని.

## గ్రామీణులకు ఉపాధినిస్తూ....

అభి'రుచి' ఉన్న రంగంలో అడుగుపెడితే కష్టనష్టాలని సవాళ్ళుగా తీసుకోవాలి. వాటినధిగమిస్తూ అడుగులు పడితే విజయం సాధ్యమే అంటున్నారు విజయలక్ష్మి.

'మా స్వస్థలం గుంటూరు. కొత్తకొత్త రుచులను అందించడమన్నా...వంటల్లో ప్రయోగాలు చేయడమన్నా నాకు భలే ఇష్టం. అందుకే మా ఊర్లో హోటల్ మేనేజిమెంట్ విద్యనభ్యసించా. ఈ రంగంలో నాకు ఉన్న అనుభవం... నగరాల్లో ఆహారపదార్థాల కున్న గిరాకీ గురించి ఆలోచించాక ఒక రెస్టారెంటు ప్రారంభించాలనుకున్నా. ఆరేళ్ళక్రితం హైదరాబాద్ చేరుకున్నాక రెస్టారెంటును ప్రారంభించడంతో ఆ కల నెరవేరింది. అయితే ఇది ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగే వ్యాపారం కాదని కొన్నిరోజులకే అర్థం అయ్యింది. ప్రధానంగా పనివారు ఏ సమస్యతో నైనా పనిలోకి రాకపోతే ఆరోజు ఇబ్బందే. అలాంటప్పుడు వినియోగదారుల నుంచి ఎంతో ఒత్తిడి. అయితే నాకున్న అనుభవంతో దగ్గరుండి పనులన్నీ చూసుకుంటూ నడిపించగలుగుతున్నా. మావద్ద పనిచేస్తున్న వారిలో సగం మంది మహిళలే. అందులోనూ నిరక్షరాస్యులు, వెనుకబడిన ప్రాంతాలనుంచి వచ్చిన గ్రామీణులే అధికం. కాస్త ఓర్పుతో వ్యవహరిస్తే పారిశ్రామిక రంగంలో రాణించడానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి' అంటున్నారు విజయలక్ష్మి.



(ఈనాడు సౌజన్యంతో)

**ఆనందం ఎక్కడినుంచో వూడిపడదు, అది నీవు చేసే పనుల ఫలితం**

# గృహహింస నిరోధక చట్టం అమలు తీరు

- ఎ.వి.రాజా

**అ**నేక విధాలుగా వివక్షకు గురవుతున్న మహిళలకు రక్షణగా 'సిడా' ('కన్వెన్షన్ ఆన్ ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫార్మ్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ ఎగెయినెస్ట్ ఉమెన్') అంతర్జాతీయ ఒప్పందం 3.9.1991న అమలులోనికి రాగా, మనదేశంలో 8.8.1993 నుంచి అమలులోనికి వచ్చింది.

వరకట్న నిషేధచట్టం-1961, సతీనిషేధచట్టం-1987, శరణాలయాల, ఇతర ఆశ్రమాల తనిఖీ నియంత్రణ చట్టం-1960, ఆంధ్రప్రదేశ్ దేవదాసీల చట్టం-1988, పౌరహక్కుల చట్టం-1955 మొదలైనవన్నీ మహిళలకు రక్షణ కల్పించడంకోసం వచ్చిన చట్టాలే. అయితే, వీటన్నింటిలో ఇప్పటివరకు మహిళలకు కొంతమేరకు రక్షణగా నిలిచింది వరకట్న నిషేధచట్టం మాత్రమే! ఈ చట్టం కేవలం వివాహ సందర్భాలలోను, వివాహితులకు మాత్రమే వర్తిస్తుంది. ఈ చట్టాలేవీ, నానా రకాలుగా సాగే గృహ హింస నుంచి మహిళకు రక్షణ కల్పించలేకపోయాయి. గృహహింస అనేది విశ్వవ్యాప్తంగా ఉన్నదన్న విషయం బహిరంగ రహస్యమే!

అందువల్ల, గృహహింసకు బలవుతున్న స్త్రీలకు రక్షణ కోసం 2006 ఆగస్టు నెలలో బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టగా, సభ ఆమోదించింది. 13.9.2006న రాష్ట్రపతి ఆమోదం పొంది,'ప్రొటెక్షన్ ఆఫ్ ఉమెన్ ఫ్రం డొమెస్టిక్ వయొలెన్సు యాక్ట్ - 2005' ( గృహహింస నుండి మహిళ లకు రక్షణ చట్టం-2005) గా పిలవబడే ఈ చట్టం 26.10. 2006 నుండి అమలులోనికి వచ్చింది.

**మహిళలకు రక్షణ కవచం**

ఈ చట్ట పరిధి చాలా విశాలమైనది. ఒకే కుటుంబం లేదా ఉమ్మడి కుటుంబంలో నివసించే మహిళలే కాదు, వివాహబంధం లేకుండా కలిసి జీవిస్తున్న మహిళ, తల్లి, కూతురు, దత్తత సంతానం, ఏదో ఒక వరుస కలిగిన బంధువు, వీరిలో ఎవరిని హింసించినా, హింసించినవారిపై గృహహింస నిరోధక చట్టం క్రింద ఫిర్యాదు చేయవచ్చు. భౌతికంగా, మానసికంగా, లైంగికంగా, ఆర్థికపరంగా, భావావేశాలతో పలువిధాలుగా, మహిళలను వేధించినా, ఆవిధంగా బెదిరించినా కూడా గృహహింస నిరోధక చట్టం క్రింద శిక్షార్హులే! అయితే, నిందితులకు శిక్ష పడటంకన్నా, బాధితులకు రక్షణ,ఊరటకలిగేలా చూడడమే ఈచట్టం ప్రత్యేకత. మహిళలకు నిలువనీడను కల్పించడం చట్టంలోని కీలకమైన అంశం.

గృహహింసకు పాల్పడినవారు భారత శిక్షాస్మృతి 498/ ఎ అధికరణ క్రింద శిక్షార్హులు.

ఈ చట్టం అమలులో కీలకపాత్ర వహించే రక్షణాధికారులను, సేవలనందించేవ్యక్తులను ప్రభుత్వం తగు సంఖ్యలో ప్రతి జిల్లాలో నియమిస్తుంది. సేవలనందించేవారిని మాత్రం ప్రభుత్వంచే గుర్తించబడిన స్వచ్ఛంద సంస్థలు నియమించాలి. ప్రభుత్వంచే నియమితులైన సేవలనందించేవ్యక్తులకు లేదా రక్షణాధికారులకు లేదా పోలీసులకు లేదా న్యాయస్థానాలకు బాధితులు ఫిర్యాదు చేయవచ్చు. రక్షణాధికారులు చట్టపరిధిలో పనిచేస్తూ, మేజిస్ట్రేట్‌కు సహాయకారిగా వుంటారు. ఫిర్యాదు అందగానే, దానిని పరిశీలించి, డొమెస్టిక్ ఇన్సిడెంటు రిపోర్టు (డి.ఐ.ఆర్)ను రూపొందించి, న్యాయస్థానానికి సమర్పిస్తారు. కేసు నమోదైన 60 రోజులలోపు తీర్పునివ్వాలి. కోర్టుకు కేసును సమర్పించేముందే, ఈ రక్షణాధికారులు బాధితులను, నిందితులను కలిసి గౌరవప్రదమైన ఇతర పరిష్కారమార్గాలు వేరే ఏమైనా వున్నాయేమో చూడాలి. ఫలితం లేకపోయినప్పుడు మాత్రమే కేసును కోర్టుకు సమర్పించాలి.

లీగల్ సర్వీసెస్ యాక్టు-1987 లోని 39వ అధికరణం ప్రకారం, రక్షణాధికారులు బాధితులకు న్యాయసహాయాన్ని ఉచితంగా అందజేయాలి. గాయపడిన బాధితులకు వైద్య పరీక్షలు చేయించి, వైద్య నివేదికలను, మేజిస్ట్రేట్‌కు అందజేయాలి. కోర్టులో కేసు నడుస్తున్నప్పుడు సేవలనందించే వ్యక్తులు లేదా సంస్థలు బాధితులకు ఆశ్రయం కల్పించాలి.

మేజిస్ట్రేట్ ఆదేశాలను ఉల్లంఘించినవారికి ఒక సంవత్సరం కారాగారశిక్ష లేదా 20వేల రూపాయల జరిమానా లేదా ఆ రెండు శిక్షలు విధిస్తారు. చట్టం అమలును నిర్లక్ష్యం

**సాహసించకపోతే సాదాసీదాతోనే సంతృప్తి పడకతప్పదు**

చేసినవారికి కూడా పైన పేర్కొన్న శిక్షలు వర్తిస్తాయి.

ప్రభుత్వం లోపరహితంగా చట్టాలను అమలు చేయాలి. అలాగే బాధిత మహిళలు, తమ బాధల నివృత్తికి ఈ చట్టాన్ని సక్రమంగా ఉపయోగించుకుని రక్షణ పొందడం సర్వదా అభిలషణీయం! చట్టాన్ని దుర్వినియోగం మాత్రం చేయకూడదు.

## 498 – ఎ

భారత రాజ్యాంగం 14వ అధికరణ , మనదేశ పౌరులైన స్త్రీ పురుషులిద్దరికీ సమానహక్కులు కల్పించింది. అయినప్ప టికీ స్త్రీల పట్ల వివక్ష నానాటికీ పెరిగిపోవడం శోచనీయం! వివక్షకు గురవుతున్న మహిళల రక్షణ కోసం 18.12.1979న జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సి.ఇ.డి.ఏ (సిడా)ను ఆమోదించింది. సిడా అనగా 'కన్వెన్షన్ ఆన్ ఎలిమి నేషన్ ఆఫ్ ఆల్ స్టార్స్ ఆఫ్ డిస్క్రిమినేషన్ ఎగెయినెస్ట్ ఉమెన్' అన్న మాట. ఇది స్త్రీల హక్కులపై దృష్టి సారించిన ప్రప్రథమ అంతర్జాతీయ ఒప్పందం! ఈ ఒప్పందం 3.9.1991 నుంచి అంతర్జా తీయంగా అమలులోనికి రాగా, 8.8.1993 నుంచి భారత ప్రభుత్వం ఆమోదించింది. మానవజాతిలో సగభాగమైన మహిళలను మానవ హక్కుల వేదిక పైకి తీసికొనిరావడంలో 'సిడా' ప్రముఖపాత్ర వహించింది.

ప్రపంచంలో నాగరికతకు పేరుగాంచిన ఫ్రాన్సు దేశంతో పాటు అన్ని దేశాలలోని మహిళలు కూడా వివక్షకు గురవుతున్నారు. భారతదేశంలో ప్రస్తుతం భర్త, అతని తల్లిదండ్రులు, అతని అక్కచెల్లెళ్ళు మొదలైనవారివలన మహిళ వరకట్న వేధింపులకు, హింసకు గురైనప్పుడు, అట్టి హింసకు పాల్పడినవారు భారత నేర శిక్షాస్మృతి 498/ఏ అధికరణ ప్రకారం కారాగార శిక్షకు అర్హులవుతారు. కాని సివిల్ లా పొందుపరచకపోవడం దురదృష్టకరం!

అట్టి వేధింపులకు గురైన మహిళ కుటుంబ పరిధిలో సమస్యను పరిష్కరించుకోలేని దుస్థితి వున్నప్పుడు, దగ్గరలోని పోలీసుస్టేషన్‌లో కేసు పెట్టగానే పోలీసులు ఐ.పి.సి. 498/ఏ క్రింద కేసు నమోదు చేసి, ఆమె భర్తను, రిపోర్టులో మహిళ పొందుపరచిన ఇతరులను అరెస్ట్ చేసి, న్యాయస్థానం ఆదేశాలమేరకు రిమాండుకు పంపుతారు. తరువాత న్యాయస్థానాలు కేసులను విచారించి, కేసు తీవ్రతను బట్టి నిందితులకు శిక్షలు విధించడం జరుగుతుంది. ❒

## జొన్నల పొట్టుతీసే యంత్రం

**చి**రుధాన్యాల, పప్పుధాన్యాల పొట్టు తీయడం వలన వాటికొనుగోలు విలువను, పోషక విలువలను కూడా పెంపొందించవచ్చు.

**ఉపయోగాలు :**

- జొన్నలు నలగడం, ఎక్కువశాతం పొట్టును నష్ట పోవడం వంటివి జరగవు.
- పొట్టును తీసివేయడం వలన జొన్నల నుండి మెత్తటి పిండిని , నాణ్యమైన రవ్వను పొందవచ్చు.
- పొట్టుతీయడం వలన జొన్నలు ఎక్కువరోజులు నిలువ వుంటాయి.
- ఈ యంత్రాన్ని స్థానికంగా లభ్యమయ్యే వస్తువు లతో, తక్కువ ధరలో తయారుచేసుకోవచ్చు.
- ఒక గంటలో 40–50 కేజీల జొన్నలనుండి పొట్టును తొలగించవచ్చు.
- యంత్రాన్ని ఒక ప్రదేశం నుంచి వేరొక ప్రదేశానికి సులువుగా తీసుకొనిపోవచ్చు.
- యంత్రానికి అవసరమయ్యే వివిధ విడిభాగాలు మార్కెట్‌లో అందుబాటులో వుంటాయి.
- యంత్రాన్ని సులువుగా నడపవచ్చు.
- పొట్టు తీసిన జొన్నలు వివిధ వంటకాలకు అనువైన రంగుతో వుంటాయి.
- జొన్నపంట ఆధారంగా చిన్నతరహా పరిశ్రమలను ఏర్పాటుచేసుకోవచ్చు.

*(ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ సౌజన్యంతో, 'వ్యవసాయం' పత్రికనుంచి పునర్ముద్రితం)*

**నీ కృషి ఏమేరకు విఫలమైతే అన్ని రెట్లు మరింత కృషి అవసరమన్న మాట**

# జాతీయ సామాజిక సహాయపథకం

## వృద్ధులకు, అనాధ కుటుంబాలకు, పేద గర్భిణులకు కేంద్రం తోడ్పాటు

వృద్ధాప్యంలో ఉన్న పేదవారిని, ప్రధానంగా పోషించే వ్యక్తిని కోల్పోయిన కుటుంబాలను, పేదగర్భిణులను ఆర్థికంగా ఆదుకోవడానికి జాతీయ సామాజిక సహాయ పథకాన్ని (ఎన్ఎస్ఎపి) కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నది. 1995 ఆగస్టు 15వ తేదీ నుంచి ఈ పథకం అమలవు తున్నది. ఆ పథకం వివరాలను గురించి తెలుసుకుందాం.

దేశంలో ఏ ప్రాంతానికి చెందినవారైనా సరే, పైన పేర్కొన్న వర్గీకరణకు చెందిన వృద్ధులకు, బాధితులకు, పేదగర్భిణులకు జాతీయస్థాయిలో కనీసంగా ఎంతోకొంత ఆర్థిక సహాయం అందేలా చూడాలన్నది ఈ పథకం ప్రధాన ఆశయం. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ప్రస్తుతం అందిస్తున్న లేదా భవిష్యత్తులో ఇవ్వబోయే సహాయానికి ఇది అడ్డంకి కాదు. ఈ పథకాన్ని అమలు జరిపినందువల్ల ఆ పథకాలను నిలిపివేయవలసిన అవసరం ఎంతమాత్రం లేదు. ఈ పథకానికి అవసరమైన నిధులను నూటికి నూరు శాతం కేంద్ర ప్రభుత్వమే సమకూరుస్తుంది.

ఈ పథకం క్రింద అందే నిధులను పేదరిక నిర్మూలన, సామాజిక సహాయ లేదా కనీస అవసరాల కల్పనకు సంబంధించిన ఇతర పథకాలకు జోడించి కూడా అమలు జరపవచ్చు. ఉదాహరణకు, పేదగర్భిణుల సహాయ పథకాన్ని, మాతా శిశు సంరక్షణ పథకాలతో కలపవచ్చు.

**ఈ పథకంలో మూడు విభాగాలు ఉన్నాయి. అవి:**

జాతీయ వృద్ధాప్య పింఛను పథకం (ఎన్ఒఎపిఎస్)

జాతీయ కుటుంబ సహాయ పథకం (ఎన్ఎఫ్బిఎస్)

జాతీయ మాతృత్వ సహాయ పథకం (ఎన్ఎమ్బిఎస్)

**జాతీయ వృద్ధాప్య పింఛను పథకం:**

ఇండియాలో పెద్ద వయసులో ఉన్న మగవారిలో మూడింట రెండువంతులు మంది, పెద్ద వయసులో ఉన్న ఆడవారిలో 90 నుండి 95 శాతం మంది నిరక్షరాస్యులు. వారిలో ఎక్కువమంది, ప్రత్యేకంగా ఆడవారు , ఒంటరిగా వుంటున్నారు. అలా పెద్ద వయసులో ఉన్నవారు, ఆర్థికంగా ఇతర కుటుంబసభ్యులపై ఆధారపడడం ఇండియాలో చాలా ఎక్కువ. 2001 సంవత్సరంలో సుమారు 1.8 కోట్లమంది మగవారికి, మరియు 35 లక్షల ఆడవారికి ఉద్యోగాలు అవసరమవుతాయని అంచనా వేశారు. (ఈ అంకెలు ప్రస్తుతం పనిచేస్తున్నవారి సంఖ్య ఆధారంగాఅంచనా వేసినవి.) వారికి ఉద్యోగాలు సృష్టించడానికి పెద్దమొత్తంలో వనరులు కావాలి. వారిలో చాలామంది బహుశా కుటుంబ సహాయం కొరకు తగినంత పొదుపు చేసి వుండరు.

2001 సంవత్సరములో సుమారు 2.7కోట్ల మంది పెద్దవారికి ఏ సమయంలోనైనాగాని వైద్యసదుపాయాలు అవసరముంటుందని కూడా అంచనా వేశారు. అటువంటి వైద్య సదుపాయాలు లేనప్పుడు వారి అవసరాల కోసం ఎక్కువ ఖర్చుని సంస్థాపన సౌకర్యాల నిమిత్తం చేయవలసి వుంటుంది. వయస్సు మళ్ళే విధానంలో భౌతికంగా వైకల్యం కలగడం మరొక ముఖ్యమైన విషయం. 2001 సంవత్సరములో సుమారు 1.7 కోట్లమంది అంగవైకల్యం గల పెద్దవారు ఇండియాలో ఉన్నారు. అందులో సగం మంది దృష్టిలోపం ఉన్నవారు ఉండవచ్చు. ఇందులో ఎక్కువ మంది పనిచేయలేని స్థితిలో ఉండి ఆర్థికంగా ఇతరులపై ఆధారపడి ఉన్నారు. కుటుంబ సహకారం లేక, వారు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తూ ఉన్నారు.

రాష్ట్రప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాలు వికలాంగులకు లేదా దిక్కులేనివారికి ఆర్థిక సహాయం చేయడానికి పథకాలు ప్రవేశపెట్టినా, ఆ పింఛను మొత్తం నెలకి 30 రూపాయల నుండి 60 రూపాయల వరకు మాత్రమే ఉంటున్నది. అంతేకాకుండా, నిధుల కొరత వలన, అర్హత కలిగిన వారిలో చాలా కొద్దిమందికిమాత్రమే పింఛను ఇవ్వడానికి అవకాశం ఉంటుంది.

**అదృష్టం వరించాలన్నా ఏదో ఒక అర్హత అవసరం, ముందు దానిని సాధించు**

ఇండియాలో వృద్ధుల పోషణ విషయంలో ముఖ్యమైన అంశం ఏమిటంటే, వీరు కుటుంబ సభ్యులతో కలసి ఉండాలని తపన పడతారు. పెద్దవారిని చూసే విషయంలో బాధ్యతల్ని విస్మరించే వారిమీద సామాజిక ఒత్తిడి నిరంతరం గా ఉంటుంది. అలా పెద్దవారిని జాగ్రత్తగా చూడడంలో ఉండే సమస్యల్ని తీర్చడానికి నైతిక విలువలని, కుటుంబ సామర్థ్యాన్ని పటిష్టం చేయడం చాలా ముఖ్యం. పెద్దవారిని మానవవనరులుగా పరిగణించి వారి విస్తృతమైన అనుభవాన్ని, మిగిలివున్న సామర్థ్యాన్ని జాతీయ అభివృద్ధికి తగిన విధంగా ఉపయోగపడేలా చేసుకోవాలి. వీరు ఆరోగ్యంతో, గౌరవంగా జీవనాన్ని సాగించేలా ప్రభుత్వం చూడాలి.

జాతీయ వృద్ధాప్య పింఛను పథకంకింద అందించే కేంద్రసహాయం ఈ క్రింది నిబంధనలకు లోబడి లభిస్తుంది.

- ధరఖాస్తుదారు (మగ లేదా ఆడ) వయస్సు 65 సంవత్సరాలకు తగ్గకూడదు.
- తన స్వంత ఆదాయంతో లేదా కుటుంబసభ్యుల ఆదాయం లేదా ఇతర ఆర్థిక వనరుల తో జీవనము సాగక దరఖాస్తుదారు పోషించేవారులేనివాడై ఉండాలి.
- వృద్ధాప్య పింఛను అర్హత నెలకు 75 రూపాయలు.

**జాతీయ కుటుంబ సహాయ పథకం**

ఈ పథకం క్రింద, దారిద్ర్యరేఖ దిగువనున్న కుటుంబంలో, ప్రధాన సంపాదనకలిగిన వ్యక్తి మరణించి నపుడు, కొంత మొత్తాన్ని కుటుంబ సహాయంగా ఇస్తారు.

- ప్రధాన సంపాదనకలిగిన వ్యక్తి కుటుంబంలోని వారై ఉండాలి. మొత్తం కుటుంబం ఆదాయంలో వారి సంపాదన ఎక్కువై ఉండాలి.
- మరణించిన వ్యక్తి వయస్సు 18-65 సంవత్సరాల మధ్య ఉండాలి.
- అది సహజ మరణమా, ఆకస్మిక మరణమా అనేదానితో నిమిత్తం లేకుండా 10,000 రూపాయలు సహాయం లభిస్తుంది.
- మరణించిన వ్యక్తి కుటుంబంలోని పెద్దవారికి, స్థానికంగా పరిశీలించి, కుటుంబ సహాయం అందజేస్తారు.

**జాతీయ మాతృత్వ సహాయ పథకం**

ఈ పథకం క్రింద దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబంలోని గర్భవతులకు ఈక్రింది నిబంధనలకు లోబడి నిర్ణీత మొత్తాన్ని అందచేస్తారు.

- గర్భిణి వయస్సు 19 సంవత్సరాలకు తగ్గకూడదు. మొదటి రెండు కాన్పులకు ఈ సహాయం లభిస్తుంది.
- లబ్ధిదారు దారిద్ర్యరేఖకు దిగువన ఉండాలి.
- 500 రూపాయల సహాయం లభిస్తుంది.
- కాన్పుకు 12-8 వారాల ముందు ఒకే మొత్తంగా మాతృత్వ సహాయం ఇవ్వబడుతుంది.
- సరైన సమయానికి మాతృత్వ సహాయం అందేలా చూడాలి. ఒకవేళ ఆలస్యం అయితే, ఈ సహాయాన్ని కాన్పు అయిన తరువాత కూడా ఇవ్వవచ్చు.

**అమలు తీరు**

- పంచాయతీ, పురపాలక సంఘం సహకారంతో రాష్ట్ర/కేంద్రపాలిత ప్రాంతాల ద్వారా జాతీయ సామాజిక సహాయ పథకాలు అమలు చేయబడుతున్నవి.
- జాతీయ సామాజిక సహాయ పథకం (ఎన్ఎస్ఎపి) మార్గదర్శక సూత్రాల ప్రకారం ఎన్ఎస్ఎపిలను అమలు చేయడానికి ప్రతి రాష్ట్రం / కేంద్రపాలిత ప్రాంతం నోడల్ డిపార్టుమెంటుని గుర్తించింది.
- నోడల్ డిపార్ట్‌మెంట్ సెక్రటరీ ఆ రాష్ట్ర / కేంద్రపాలిత ప్రాంతానికి నోడల్ సెక్రటరీగా వ్యవహరించాలి.
- ఎన్ఎస్ఎపిమీద జిల్లాలలో జిల్లాస్థాయికమిటీలున్నాయి.
- తమ ప్రాంతాలలో ఎన్ఎస్ఎపిక్రింద పథకాలని అమలు చేయడానికి తమ జిల్లామెజిస్ట్రేట్/జిల్లాకలెక్టరు అధ్యక్షతన జిల్లా స్థాయి అమలుచేసే అధికారుల నియామకాన్ని రాష్ట్రాలు / కేంద్రపాలితప్రాంతాలు ప్రకటించాయి.
- ధరఖాస్తుల్ని పరిశీలించడం లబ్ధిదారులకు ఆ సహాయాల్ని అందేలా చేసే బాధ్యత జిల్లా కలెక్టరు లేదా నోడల్ అధికారులకు ఉంటుంది.
- సొమ్ము ఇచ్చే అధికారులు, ముందుగా నిర్ణయించిన నిబంధనల / నియమాల ప్రకారం డబ్బుని నగదు రూపంలో లేదా ఇతర రకాలుగా చెల్లించవచ్చు.

**అందరి కళ్ళూ చూస్తాయి, కొందరి కళ్ళే కనుగొంటాయి**

# చింతలు తీర్చిన టిఫిన్ సెంటర్



**కా**లువపల్లి, చిత్తూరు జిల్లా పలమనేరు మండలం లోని ఒక చిన్న గ్రామం. ఆ గ్రామంలోని యస్.రత్నమ్మ సాయితేజ మహిళా సంఘం సభ్యురాలు. సంఘంలో చేరకముందు, ఆమె, ఆమె భర్త కూలీకి వెడుతూ, ఆర్థికం గా నానా ఇబ్బందులతో జీవిస్తుండేవారు. సంఘంలో చేరి, సులభమైన అప్పులతో, తమ గ్రామంలో టిఫిన్ సెంటర్ ను, చిల్లర దుకాణాన్ని ఏర్పాటుచేసుకుని, ఆ కుటుంబం ఇప్పుడు నమ్మకమైన ఆదాయంతో ఒడిదుడుకులు లేకుం డా జీవించగలుగుతున్నది. తగిన జీవనోపాధిని ఏర్పాటు చేసుకుని, తమ జీవనాన్ని మెరుగుపరచుకున్న తీరును ఆమె మాటలలోనే తెలుసుకుందాం:

“మేము బి.సి. కులానికి చెందినవారం. నేను 2006 సం॥లో సంఘంలో చేరాను. మేము ముగ్గురం కుటుంబ సభ్యులం (నేను, భర్త, కొడుకు). నేను సంఘంలో చేరక ముందు కనీసం పొదుపు అనే మాట వినలేదు; ఎందు కంటే ఎప్పుడూ అప్పులలోనే కూరుకుపోయి వుండే వాళ్ళం. ఇటువంటి తరుణంలో ‘ఇకాంవెల్’ అనే స్వచ్ఛంద సంస్థ ప్రోత్సాహంతో సంఘంలో చేరాను. తర్వాత, ఇందిరాక్రాంతి పథం, ఏపిమాస్ అధికారుల చొరవతో వివిధ రకాల జీవనో పాధులపై అవగాహన పెంచుకున్నాను.

మా గ్రామం పలమనేరు పట్ట ణానికి 15 కిమీ దూరంలో వున్నది. గ్రామంలో చిన్నపాటి దుకాణమైనా లేనందున గ్రామంలోని వారందరూ పలమనేరుకు వెళ్ళి సరుకులు తెచ్చుకునేవారు. ఈ విషయం గమనించి, నా భర్త, నేను చర్చించుకొని, కొద్ది పెట్టుబడితో, చిల్లర దుకా ణాన్ని, టిఫిన్ సెంటర్‌ను ప్రారంభించాలనుకున్నాము. బ్యాంకునుండి, సంఘంనుండి రూ. 28,600/ అప్పుగా తీసుకొని టిఫిన్ సెంటర్, చిల్లర దుకాణం ఏర్పాటు చేసు కున్నాము. ఈ రెండిటిద్వారా ప్రతిరోజు రూ. 800 నుండి 1000 వరకు వసూళ్ళు వస్తున్నవి. ఇందులో ఖర్చులు పోను, ప్రతిరోజు కనీసం రూ. 200- నికర ఆదాయం వస్తున్నది. మాకు మేమే ఏర్పాటు చేసుకున్న ఈ జీవనో పాధితో, ఎటువంటి ఇబ్బందిలేకుండా ఇంటిదగ్గర నుండే, మేమిరువురము కనీసం చెరి రూ. 100/- సంపాదించ గలుగుతున్నాము” అని ఆఆమె వివరించారు. రత్నమ్మ కుటుంబం కొత్త జీవనోపాధి ఇచ్చిన మనోధైర్యంతో, నిబ్బరంగా కాలం గడపగలుగుతున్నది. సంఘంలో ప్రస్తుతం రత్నమ్మ పొదుపు 2300 రూపాయలు. ❒

- మూడు ఎన్ఎస్ఎపి పథకాల క్రింద, లబ్ధిదారులను గుర్తించడంలో గ్రామ పంచాయతీలు / పురపాలక సంఘాలు చురుకైన పాత్ర వహించవలసి వుంటుంది.
- లక్ష్యాలకనుగుణంగా పంచాయతీలు/పరిసర ప్రాంత కమిటీలు / మొహల్లా కమిటీలచే లబ్ధిదారులను తగిన విధంగా గుర్తించడానికి జాతీయ వృద్ధాప్య పింఛను పథకం, జాతీయ కుటుంబ సహాయ పథకం, జాతీయ మాతృత్వ సహాయ పథకం లక్ష్యాల్ని పంచాయతీలకు/ పురపాలక సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం తెలియపరచాలి.
- గ్రామీణ ప్రాంతాలలో గ్రామసభా సమావేశాలు, పట్టణా లలో పరిసర ప్రాంత కమిటీలు / మొహల్లా కమిటీ సమావేశాలలో కూడా జాతీయ వృద్ధాప్య పింఛను పథకం, జాతీయ కుటుంబ సహాయ పథకం, జాతీయ మాతృత్వ సహాయ పథకం క్రింద కేంద్ర సహాయాన్ని లబ్ధిదారులకు అందజేయవచ్చు .
- జాతీయ సామాజిక సహాయ పథకం సమాచారం గురించి, వాటిక్రింద లభించే సహాయం గురించి ప్రచారం చేయడం పంచాయతీల / పురపాలక సంఘాల బాధ్యత. ఈ పనిలో స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని కూడా వారు తీసుకోవచ్చు. ❒

**ఇష్టం పెంచుకుంటే ఏ పనీ కష్టం కాదు**

# బేకరి బిస్కెట్ల తయారీ పరిశ్రమ



- మైనంపాటి శ్రీనివాసరావు

ఇటీవలికాలంలో మన దేశంలోని గ్రామీణ ప్రాంతాల లోని ప్రజల జీవనవిధానంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయనే విషయం నిర్వివాదాంశం. అక్షరాస్యతలో, జీవనప్రమాణంలో వృద్ధితోపాటు; ఆహారపు అలవాట్లలో, వస్త్రధారణలో, డబ్బును ఖర్చుచేసే పద్ధతులలో గతంతో పోలిస్తే నేటి గ్రామీణులలో చాలా మార్పు వచ్చింది. అందువల్లనే కాఫీ, టీ ల వంటి పానీయాలను అమ్మే దుకాణాలు నేడు ప్రతి గ్రామంలో ఒక ఆవశ్యకతగా మారాయి. కాఫీ లేదా టీ వంటి పానీయంతోపాటు, బిస్కెట్లను కూడా తినడం నేటి యువతకు ఒక అలవాటుగా మారింది అంటే ఆశ్చర్యం లేదు.

బేకింగ్ అంటే, 'మూసివుంచిన పాత్రలో ఆహారాన్ని వండటం' అని స్థూలంగా చెప్పవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధితో తక్కువ సమయంలో, ఎంతో రుచిగా





ఆహారపదార్థాలను తయారుచేయడానికి ఒవెన్‌లు రంగ ప్రవేశం చేశాయి. బేకింగ్ పద్ధతిలో ఆహారపదార్థాలను అనగా- బ్రెడ్ బిస్కెట్, కేక్స్, బన్స్, రస్కులను - తయారుచేసే వ్యక్తిని బేకర్ అంటారు. కాగా బేకింగ్ పద్ధతిలో ఆహార పదార్థాలను తయారుచేసే ప్రదేశాన్ని బేకరీ అంటారు.

మనదేశ బేకరీ పరిశ్రమ పరిమాణం దాదాపు రూ.6900 కోట్లు. దీనిలో 80 శాతం బ్రెడ్, బిస్కెట్లు. మన దేశంలో వ్యవస్థీకృతంకాని బేకరీల సంఖ్య సుమారు 75,000. వీటిద్వారా ప్రతి సంవత్సరం ఉత్పత్తి అయ్యే ఉత్పత్తుల పరిమాణం 23.52 లక్షలమెట్రిక్ టన్నులు. బేకరీ ఉత్పత్తులలో ప్రధానమైన బిస్కెట్ల వినియోగం పట్టణ ప్రాంతాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాలలో అధికంగా వున్నది! మొత్తం బిస్కెట్ల దేశీయ వినియోగంలో 55 శాతం గ్రామీణ ప్రాంతాలలోనే వున్నది. ఇతర రాష్ట్రాలతో పోల్చినపుడు మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక ఉత్తరప్రదేశ్‌లలో బేకరీ ఉత్పత్తుల వినియోగం అధికంగా వున్నదని గణాంకాలు తెలుపుతున్నాయి.

**ఆరోగ్యానికి మేలు**

వివిధరకాలైన ఇతర ఆహారపదార్థాలతో పోలిస్తే, తక్కువ క్రొవ్వు వుండే బేకరీ ఉత్పత్తులు మంచి ఆరోగ్యకరమైన ఆహారంగా చెప్పవచ్చు. బేకింగ్ విధానంలో అతి తక్కువ నూనెను వినియోగించడం జరుగుతుంది. అంతేగాక పూర్తిగా మూసివుంచిన పాత్ర (ఒవెన్) లో ఆహారపదార్థాలను తయారుచేయడం జరుగుతుంది కనుక ముడిపదార్థాలలో వుండే పోషక విలువలు కోల్పోవటం జరుగదు. అందువల్ల బేకరీ ఉత్పత్తులనుంచి వినియోగదారులకు మంచి పోషకవిలువలు లభిస్తాయి.

నిర్ణీత నిష్పత్తిలో ముడిపదార్థాలను మిశ్రమంగా చేసి, నిర్ణీత ఉష్ణోగ్రత వద్ద, నిర్ణీత సమయం బేకింగ్ చేస్తే, బేకరీ ఉత్పత్తులు మంచి రుచిని కూడా కలిగివుంటాయి. అందువల్లనే, మన దేశంలో బేకరీ ఉత్పత్తుల వినియోగం క్రమంగా పెరుగుతున్నది. 1971 సంవత్సరంలో మన దేశ సగటు బేకరీ ఉత్పత్తుల వినియోగం కేవలం 200 గ్రాములు వుండగా, 2008-09 సం॥లో 2.1 కేజీకి వృద్ధి చెందింది. అయితే, బేకరీ ఉత్పత్తుల సగటు వినియోగం చైనాలో 5.5

**చెరగని ఆత్మ విశ్వాసం, ఏ ఉద్యమానికైనా అదే విజయపతాకం**

కేజీలు కాగా, అమెరికాలో 7.5 కేజీలుగా ఉన్నది. మన దేశంలో బేకరీ ఉత్పత్తుల వినియోగం పెరుగుదలకు మంచి ఆస్కారం వున్నదని, అభివృద్ధి చెందిన దేశాల సగటు వినియోగాన్ని గమనిస్తే తెలుస్తుంది.

**బేకరీ బిస్కెట్ల తయారీ గ్రామీణ పరిశ్రమ**

మంచి రుచిని కలిగివుండటమే కాకుండా, ఆరోగ్యానికి తోడ్పడే బేకరీ బిస్కెట్ల తయారీని మండలస్థాయిలో లేదా గ్రామస్థాయిలో చేపట్టి స్థానిక ప్రజల అవసరాలకు తగినట్లుగా ఉత్పత్తిచేసి మార్కెట్ చేయడం ద్వారా లాభార్జన చేయవచ్చు.

నాణ్యతపట్ల ఆసక్తి వుండి, ఆహారపదార్థాల తయారీ పరిశ్రమను నెలకొల్పాలని భావించేవారికి చిన్నతరహా బేకరీ బిస్కెట్ల తయారీ పరిశ్రమ మంచి లాభదాయక పారిశ్రామిక అవకాశం అవుతుంది.



**భిన్న రుచులు-విభిన్న ఆకారాలు**

బేకరీ బిస్కెట్లు/కుకీలను కస్టమర్ల అభిరుచులకు అనుగుణంగా వివిధ రుచులలో, ఆకర్షణీయంగా కనిపించే విధంగా వివిధ ఆకారాలలో తయారుచేయవచ్చు. కాలక్షేపానికి అల్పాహారంగా తినే తక్కువ ధర బిస్కెట్లను, బలవర్ధక పోషకవిలువలు కలిగిన ఖరీదైన బిస్కెట్లు / కుకీలు, ఇతర ఉత్పత్తులను తయారుచేయవచ్చు.

మార్కెట్‌లో లభ్యమయ్యే నాణ్యమైన బేకరీ బిస్కెట్ల ధరలు...కిలోకు:

1. జీలకర్ర కలిగిన కుకీలు రూ.150
2. బాదంపప్పు కలిగిన కుకీలు రూ.300
3. జీడిపప్పు కలిగిన కుకీలు రూ.345
4. చాక్లెట్ కలిగిన కుకీలు రూ.250
5. కొబ్బరి కలిగిన కుకీలు రూ.200
6. బట్టర్ స్కాచ్ కుకీలు రూ.250
7. ఫ్రెంచి స్వీట్‌హార్ట్ బిస్కెట్స్ రూ.160
8. చాయి బిస్కెట్స్ రూ.125
9. నేతి బిస్కెట్లు రూ.250
10. జామ్ బిస్కెట్స్ రూ.125

సృజనాత్మకత కలిగినవారు ఈ బేకరీ బిస్కెట్ల తయారీ పరిశ్రమను గ్రామీణ ప్రదేశాలలో ప్రారంభించి, సమీప పట్టణ, నగర మార్కెట్లలో కూడా అధిక ధరలకు అమ్మవచ్చు. ఆధునిక రుచులతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడానికి తోడ్పడే పుస్తకాలు కూడా లభ్యమవుతున్నాయి.

విజయసాధన ఆకాంక్షతో పనిచేసేవారికి, బేకరీ ఉత్పత్తుల తయారీ పరిశ్రమలో అభివృద్ధికి ఆకాశమే హద్దు అని చెప్పవచ్చు.

**పరిశ్రమ స్థాపన వివరాలు :**

1. పరిశ్రమ సామర్థ్యం : రోజుకు 500 కేజీల బేకరీ బిస్కెట్ల తయారీ
2. విద్యుచ్ఛక్తి ఆవశ్యకత : 5 హెచ్.పి (3 ఫేజ్ కనెక్షన్)
3. పనిగంటలు : రోజుకు 18-20

**పరిశ్రమ ఆర్థిక వివరాలు :**

అవసరమైన భవనం: 1000 చ.అ పరిశుభ్రమైన భవనం

భవనం లీజు అడ్వాన్స్ : రూ.60,000

నెలసరి బాడుగ : రూ.6000

2. యంత్ర పరికరాలు :

ఎ. ప్లానెటరీ మిక్సర్ (8 కేజీల సామర్థ్యం) - 1 రూ.81,000

బి. రోటరీ రాక్ ఒవెన్ (7-9 కేజీలు సామర్థ్యం) రూ.3,90,000

సి. ట్రాలీలు - 2 రూ.12,000

**'నిదానం ప్రధానం' నిజమే, కాని 'ఆలస్యంతో అమృతం కూడా విషమవుతుంది' అనేదీ గుర్తించుకోవాలి**

MS January fianl pages-Final.pmd 26 12/31/2010, 10:36 AM

డి. బిస్కెట్లు బేకింగ్ ట్రేలు - 48 రూ. 7,200

ఇ. బిస్కెట్‌తయారీ అచ్చులు 8 రకాలు రూ. 52,800

ఎఫ్. ఇతర పరికరాలు రూ. 57,000

జి. ఆయిల్‌పైప్‌లు, చిమ్నీ, వైరింగ్ మొ॥వి 57,000

**మొత్తం యంత్రపరికరాలు 6,00,000**

3. వస్తు రవాణా ఆటో 3,00,000

4. విద్యుత్‌శాఖ డిపాజిట్+భవన డిపాజిట్ 75,000

5. ప్రాథమిక వ్యయాలు 20,500

6. ప్రారంభం ముందు వ్యయాలు 1,05,000

**మొత్తం స్థిరవ్యయాలు (2.3.4.5.6)**

**11,00,000**

వర్కింగ్ క్యాపిటల్ గణన : (నెలకు)

**1. ముడి పదార్థాలు :**

రోజుకు 500 కేజీలు × 25 రోజులు = 12,500 కేజీలు

ప్రధాన ముడిపదార్థాలు : బేకింగ్ పొడి, చక్కెర, ఉప్పు బట్టర్, బిస్కెట్ పౌడర్, ఫ్లేవర్లు, ప్రిజర్వేటివ్స్ మొ॥వి)

సగటుముడిపదార్థాల వ్యయం 1 కేజీకి రూ.125

ముడిపదార్థాల వ్యయం : 12500×125 = 15,62,500

2) ప్యాకింగ్ ముడిపదార్థాలు :

సగటు ప్యాకింగ్ ముడిపదార్థాలు

వ్యయం = రూ. 8 కేజీ

12500 × రూ.8= 1,00,000

**మొత్తం ముడిపదార్థాల వ్యయం = 16,62,500**

**2. ఇంధన వ్యయం :**

ఏ.. విద్యుత్‌శక్తి

3 హెచ్.పి. × 0.7453 × 12 గం. = 27 యూనిట్లు/ రోజుకు

నెలకు = 27 × 25 రోజులు = 675 యూనిట్లు

బి. ఇతర విద్యుత్ 125 యూనిట్లు

**మొత్తం = 800 యూనిట్లు**

విద్యుత్ వ్యయం= 800 యూనిట్లు × రూ.5 = 4000

సి.. డీజిల్

ఆటోరవాణా =

200 కిమీ రోజుకు / 35 కిమీ = 5.71×25 రో =

142.85 లీటర్లు = 145 లీటర్లు

వ్యయం = 145 లీ × రూ.43 = 6235.00

డి.. మినరల్ వాటర్

రోజుకు 200 లీ × 25రో = 5000 లీ

వ్యయం = 5000 లీ = రూ.1 = 5000

**మొత్తం = 15,235**



**3. జీతాలు, వేతనాలు రూ. 10,000**

| | | | |
|---|---|---|---|
| ఏ. | బేకర్ - 1 | రూ.10,000 | 20,000 |
| బి. | సహాయకులు - 4 | 5,000 | 6,000 |
| సి. | డ్రైవర్ - 1 | 6,000 | 6,000 |
| డి. | ప్యాకింగ్ పనివారు - 2 | 3,000 | 5,000 |
| ఇ. | వాచ్‌మెన్స్ - 2 | 2,500 | |
| | మొత్తం | | 47,000 |
| | యాడ్ : కంటిజెన్సీలు 20% | | 9,400 |
| | **మొత్తం** | | **56,400** |

భవనం అద్దె 6000

నిర్వహణావ్యయాలు 25,500

రిపేర్లు, ఇన్సూరెన్స్ 15,000

100% కెపాసిటీ వినియోగానికి వర్కింగ్ క్యాపిటల్

**సమర్థుడు మట్టిలోనుంచి మాణిక్యాలు సృష్టించగలడు, అసమర్థుడు మాణిక్యాన్నీ మట్టిపాలు చేసుకుంటాడు**

(16,62,500 + 15235 + 56,400 + 6000 + 25000 + 15000 = 17,80,135

**17,80,100**

50% సామర్థ్య వినియోగంపై అవసరమైనవర్కింగ్ క్యాపిటల్ = 17,80,000.00 8,90,000

దాదాపు = **9,00,000**

50శాతం సామర్థ్య వినియోగం ప్రాజెక్టు పెట్టుబడి =

| | |
|---|---|
| 1.స్థిరవ్యయాలు | 11,00,000.00 |
| 2. వర్కింగ్ క్యాపిటల్ | 9,00,000.00 |
| **మొత్తం** | **20,00,000.00** |

వనరుల సమీకరణ :

| | |
|---|---|
| ఏ. వ్యవస్థాపకుని మూలధనం | 5,00,000.00 |
| బి. టర్మ్‌లోన్ | 8,25,000.00 |
| సి.. వర్కింగ్ క్యాపిటల్ రుణం | 6,75,000.00 |
| **మొత్తం** | **20,00,000.00** |

లాభదాయకత అంచనా :

ఎ. అమ్మకాలు (సంవత్సరం)

12500 × 50%×12 = 75000 కేజీలు

సగటు అమ్మకపు ధర = రూ.200/-కేజీ

సంవత్సర అమ్మకాల విలువ =

75,000 × 200 = 1,50,000.00

సంవత్సర ఆదాయం (ఎ) **1,50,000.00**

బి. సంవత్సర వ్యయాలు

1. ఉత్పాదక వ్యయాలు

17,80,000 = 50% × 12 = 1,06,80,000.00

2. తరుగుదల

యంత్ర పరికరాలు 15% × 6,00,000 = 90,000.00

రవాణా వాహనం 15% × 3,00,000 = 45,000.00 1,35,000.00

3. రుణాలపై వడ్డీలు

ఎ) టర్మ్‌లోన్ 12% × 8,25,000.00 = 99,000.00

బి) వర్కింగ్ క్యాపిటల్ 13% × 6,75,000.00 = 87,750.00 1,86,750.00

4. ప్రాధమికవ్యయాల రద్దు 20,000.00

5. ప్రారంభం ముందు వ్యయాల రద్దు 1,05,000.00

మొత్తం సంవత్సర వ్యయాలు :

(1,06,80,000+1,35,000+1,86,750+20,000+1,05,000)

మొత్తం సంవత్సర వ్యయాలు (బి) 1,11,26,750.00

లాభం :

| | |
|---|---|
| సంవత్సర అమ్మకాలు (ఎ) | 1,50,00,000.00 |
| -)సంవత్సర వ్యయాలు (బి) | 1,11,26,750.00 |
| లాభం = | 38,73,250.00 |

లాభదాయకత విశ్లేషణ :



1.అమ్మకాలపై లాభం :

రూ.38,78,250/ రూ.1,50,00,000×100 = 25.82%

2.ప్రాజెక్టు పెట్టుబడిపై లాభం :

రూ.38,78,250/ రూ.20,00,000 × 100 = 194.00%

3.మూలధనంపై లాభం

రూ.38,78,250/రూ.5,00,000 × 100 = 775.65%

గమనిక :

ప్రాజెక్టు ప్రొఫైల్‌లోని ఆర్థిక వివరాలు అన్నీ అంచనాలే. వాస్తవంలో కొంచెం హెచ్చుతగ్గులు వుండగలవని గమనించగలరు.

**(వ్యాసరచయిత, బిజినెస్ కన్సల్టెంట్ ;**

**మొబైల్ ఫోన్ నం : 9866119816 )**

**మాట్లాడడమూ ఒక కళే, అది తెలియని వారి మాటలతో ఉభయులకూ వ్యధే**

# ఉత్తమ మండల సమాఖ్యగా అవార్డు పొందాలంటే...

స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల పద్ధతిలాగ కాకుండా, మండల సమాఖ్యలు తక్కువ సంఖ్యలో వున్నాయి కనుక అన్ని సమాఖ్యల ప్రతిభను పోల్చి చూస్తున్నాము. కాబట్టి మనం ఇక్కడ తీసివేసే స్థాయిల గురించి పట్టించుకోనవసరము లేదు. కానీ సమాఖ్యలు కొన్ని కనీస ప్రతిభా ప్రమాణములను పాటించినట్లు కనిపించాలి. ఇక్కడ మనం కేవలం కొన్ని సంస్థలతో మాత్రం వ్యవహరిస్తున్నాము. కాబట్టి ఈ అవకాశాన్ని అన్ని మండల సమాఖ్యలను పరిశీలించుటకు ఉపయోగించుకుందాము. పరిశీలించిన తరువాత ఒక్కొక్క మండలసమాఖ్యతో వారి బలాలను, బలహీనతలను చర్చిద్దాము. అందువలన మన క్లస్టరులో వున్న మండల సమాఖ్యలు అన్నీ మేలుగా పనిచేసే సంస్థలుగా అవుతాయి. ఒక సంవత్సరంలో అవార్డును పొందివుంటే, వచ్చే సంవత్సరంలో అవార్డును పరిశీలించే సమయంలో అవార్డు పొందిన మండలసమాఖ్యను పరిగణనలోకి తీసుకోకూడదని ఒక షరతుగా పెట్టుకోవచ్చు. ఈ షరతు వలన వేరే మండల సమాఖ్యలు కూడా ఆ స్థాయిలో ప్రతిభను చూపేలా ప్రోత్సహించవచ్చు.

> *మండల సమాఖ్య ప్రతిభను పరిశీలించేటప్పుడు మనం ఆ మండల సమాఖ్యలో వున్న స్వయం సహాయక సంఘాల, గ్రామ సంఘాల ప్రతిభను కూడా పరిశీలించాలి. సభ్యత్వ సంఘాలు,గ్రామ సంఘాలు సరిగా పనిచేయకపోతే, మంచి మండల సమాఖ్య వున్నా ఉపయోగం ఏమిటి?*

**ప్రతిభను అంచనా వేయుట**

కనీసం మరొక కొన్ని సంవత్సరాల వరకు మనం మన ప్రాంతంలో స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామ సంఘాల సంఖ్య పెరుగుతుందని ఆశించవచ్చు. అంటే మన మండలంలో మొత్తం మీద సభ్యత్వం పెరుగు తుందని అర్థం. ఎవరు సంఘాలలో చేర లేదు, ఏ పల్లెలలో సంఘాలు కాలేదు, ఏయే గ్రామాలకు ఇంకా గ్రామ సంఘాలు లేవు అన్నది పరిశీలించుట మండల సమాఖ్య చేయవలసిన పని. పరిశీలించిన తరువాత ఆయా ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామ సంఘాల ఏర్పాటుకు సహకరించాలి.

మండల సమాఖ్య ప్రతిభను పరిశీలించేటప్పుడు మనం ఆ మండల సమాఖ్యలో వున్న స్వయం సహాయక సంఘాలు మరియు గ్రామ సంఘాల ప్రతిభను కూడా

## గర్భిణులకు నగదు బదిలీ : దశలవారీగా రూ.4 వేలు అందజేత

**మ**హిళలు, చిన్నారుల్లో పోషకాహార లోపం, రక్తహీనత తదితరాలను నిరోధించడానికి ఉద్దేశించిన 'ఇందిరాగాంధీ మాతృత్వ సహయోగ్ యోజన' పథకానికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ పథకం అమలుకు వెయ్యికోట్లు కేటాయించారు. దీన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా 52 జిల్లాల్లో 11వ పంచవర్ష ప్రణాళిక మిగిలిన కాలానికి అమలు చేస్తారు. ఐసీడీఎస్ మౌలిక సదుపాయాలు, సిబ్బంది, ఐసీడీఎస్ కార్యాలయా లతో పాటు ఆరోగ్య వ్యవస్థల సహకారాన్ని ఈ పథకం అమలులో తీసుకుంటారు. ఇది 100% కేంద్ర నిధులతో కొనసాగే పథకం. తొలుత 2010-11, 2011-12 సంవత్సరాలకు గాను వరుసగా రూ.390 కోట్లు, 610 కోట్లు కేటాయించారు. ఈ పథకం కింద గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు పోషకాహారం కోసం నగదు బదిలీ చేస్తారు. ఈ పథకం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగినులకు వర్తించదు. గర్భం ధరించింది మొదలు.... బిడ్డకు ఆరునెలలు వచ్చే వరకూ వివిధ దశల్లో రూ.4 వేలు అందిస్తారు. లబ్ధిదారులైన మహిళలు 19 ఏళ్ళు దాటినవారై ఉండాలి. నగదు బదిలీ కోసం లబ్ధిదారులు బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఖాతా తెరవాలి.

**కొందరికి నవ్వడం, నవ్వించడం తెలుసు, మరికొందరికి నవ్వులపాలు కావడమే తెలుసు**

పరిశీలించాలి. సభ్యత్వ సంఘాలు మరియు సభ్యత్వ గ్రామ సంఘాలు సరిగా పనిచేయకపోతే, మంచి మండల సమాఖ్య వుండడం వలన ఉపయోగం ఏమిటి? మొదట కొన్ని సంవత్సరాలలో సభ్యత్వ గ్రామ సంఘములు మరియు వాటి స్వయం సహాయక సంఘములపై మనకు కావలసిన వివరాలన్నీ పొందుట కష్టముగా వుండవచ్చు. కాబట్టి మొదట కొన్ని సంవత్సరాలు మనం మండల సమాఖ్య పనితీరును మాత్రమే లెక్కలోకి తీసుకుందాము.

| | ప్రతిభా ప్రమాణములు | మార్కులు |
|---|---|---|
| 1 | ఉద్యమములో సభ్యత్వము క్రమంగా పెరుగుతోంది (మహిళలుఎక్కువమంది ఉద్యమంలో చేరాలని ఆశిస్తున్నట్లు మండల సమాఖ్య ఉద్యమమును మండలం అంతావ్యాపించేటట్లు పనిచేస్తోందని సూచిస్తుంది) | **అ.** 10- గత సంవత్సరం నుండి సభ్యత్వము 10 శాతం మరియు ఇంకా ఎక్కువ పెరిగి వుంటే.<br>5- సభ్యత్వము పెరిగింది కానీ 10 శాతం కన్నా తక్కువ అయితే.<br>0- సభ్యత్వము ఒకచోట ఆగిపోయింది లేక తగ్గిపోయింది.<br>**ఆ.** 10- మండలంలోని ఎస్సి, ఎస్టి జనాభా శాతం కన్నా, మండల సమాఖ్యలో ఎస్సి, ఎస్టి సభ్యత్వ శాతం ఎక్కువగా వుంటే.<br>5- మండలంలోని ఎస్సి, ఎస్టి జనాభా శాతం, మండల సమాఖ్యలో ఎస్సి, ఎస్టి సభ్యత్వ శాతం సమానంగా లేదా తక్కువ వుంటే. ; 0- తక్కువగా వుంటే. |
| 2 | గత సంవత్సరం నుండి సొంత నిధులు పెరిగాయి. (స్వంత నిధులు = వాటాధనము + గ్రామ సంఘాల పొదుపులు మరియు ఫిక్స్‌డ్ డిపాజిట్లు + రిజర్వులు + సిఐఎఫ్ వంటి ఒకసారి ఇచ్చే ఇతర నిధులు)(అంటే మన సభ్యత్వ గ్రామ సంఘాలకు అందిస్తున్న సేవలు పెంచుతూనే, మండల సమాఖ్యలో గ్రామ సంఘాల ఆర్థిక యాజమాన్యాన్ని పెంచుతున్నామని అర్థము) | 10- పరిశీలనలో వున్న సంవత్సరము మొదటిలో వున్న నిధులకన్నా, సంవత్సరము చివరన 10 శాతం కన్నా ఎక్కువగా వుంటే.<br>5- సొంత నిధులు 5 శాతం నుండి 10 శాతం మధ్యన పెరిగి వుంటే.<br>0- సంవత్సరం ఆఖరున సొంత నిధులు పెరగకుండా వుండి లేదా 5 శాతం కన్నా తక్కువ పెరిగి వుంటే. |
| 3 | సభ్యత్వ గ్రామ సంఘాలకు ఇచ్చే అప్పులు పెరిగాయి. (గ్రామ సంఘాలకు సేవలు పెరుగుతూ వుండాలని ఆశిస్తున్నాము. ఎందుకంటే గ్రామ సఘాల అవసరాలు పెరుగుతూ వుంటే వారు తీర్చుకోగలరు) | 10- గత సంవత్సరము ఇచ్చిన అప్పులకన్నా ఈ సంవత్సరం ఇచ్చిన అప్పులు 20 శాతం లేదా ఇంకా ఎక్కువ పెరిగి వుంటే.<br>5- పెరుగుదల వుండి, ఆ పెరుగుదల గత సంవత్సరంపై 20 శాతం కన్నా తక్కువ అయితే.<br>0- అసలు పెరగకపోతే. |

**ఆశాజీవిని సముద్రంలో ముంచినా చేపతోకపట్టుకుని పైకి తేలుతాడు**

| | ప్రతిభా ప్రమాణములు | మార్కులు |
|---|---|---|
| 4 | | 10- సంవత్సరం ఆఖరున డిసిబి పట్టిక 100శాతం వసూలును చూపిస్తే<br>5- 75 శాతం లేదా ఇంకా ఎక్కువ వసూలు చూపిస్తే.<br>0- 60 శాతం నుండి 75 శాతం మధ్యన వసూలు జరిగినట్లు చూపిస్తే.<br>-5 - 60 శాతం కన్నా తక్కువ వసూలు చూపిస్తే. |
| 5 | మండల సమాఖ్య ప్రజాస్వామ్య, పారదర్శకతతో తన సభ్యులకు జవాబుదారీగా వున్నది. | **అ.**10- మండల సమాఖ్య యొక్క వార్షిక సమావేశము సంవత్సరం ముగిసిన 3 నెలలోపు నిర్వహించి వుంటే<br>5- వార్షిక మహాసభ సమావేశము సంవత్సరం ముగిసిన 4 నెల లోపు నిర్వహించి వుంటే.<br>0- సంవత్సరం ముగిసిన 6 నెలల లోపు నిర్వహించి వుంటే.<br>-5 - వార్షిక మహాసభ సమావేశము సంవత్సరం ముగిసిన 6 నెలల తర్వాత నిర్వహించారు లేక అసలు నిర్వహించలేదు.<br>**ఆ.**10 - సంవత్సరం ముగిసిన 3 నెలలలోపు వార్షిక మహాసభ సమా వేశములో సభ్యత్వ గ్రామ సంఘాలన్నింటికీ వార్షిక రిపోర్టు లతో పాటు ఆడిట్ చేసిన పట్టికలు కూడా అందించారు.<br>5- ముద్రించిన వార్షిక నివేదికలతోపాటు ఆడిట్ చేసిన పట్టికను సంవత్సరం ముగిసిన4 నెలలలోపు మహాసభసమావేశంలో ఇచ్చారు.<br>0- రిపోర్టు మరియు ఆడిట్ చేసిన పట్టికలు సంవత్సరం ముగిసిన 6 నెలలలోపు ఇచ్చి వుంటే<br>-5 - వార్షిక నివేదిక ముద్రించలేదు, లేక ఆడిట్ చేసిన పట్టికలు సమర్పించలేదు లేక ఇవి సంవత్సరం ముగిసిన 6 నెలల తర్వాత ఇచ్చారు.<br>**ఇ.**10- ఖాళీ వున్న స్థానాలలో 1/3 వంతుల స్థానాలకు మండల సమాఖ్య గత వార్షిక మహాసబ సమావేశంలో ఎన్నికలు నిర్వహిం చింది. ఈ సీట్లకు పోటీ చేశారు.<br>5- 1/3 వంతు స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు కానీ పోటీ లేదు (ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది)<br>0- ఎన్నికలు వార్షిక మహాసభ సమావేశంలో కాకుండా బయట జరిగాయి.<br>- 5 - ఒక సంవత్సరం నుండి ఎన్నికలు నిర్వహించలేదు. |

**కర్తవ్యాన్ని పాటించడాన్ని మించిన పరమధర్మం లేదు**

| | ప్రతిభా ప్రమాణములు | మార్కులు |
|---|---|---|
| 6 | మండల సమాఖ్య అందరికీ తెలిసే విధముగా జవాబుదారీగా వుంది. మరియు రిజిస్ట్రార్‌కు రిటర్న్ దాఖలు చేస్తున్నది. | 10- రిటర్న్స్ సంవత్సరం ముగిసిన 4 నెలలలోపు ఫైల్ చేసి వుంటే.<br>5- రిటర్న్స్ సంవత్సరం ముగిసిన 6 నెలలలోపు ఫైల్ చేసి వుంటే.<br>0- 6 నెలల తర్వాత రిటర్న్స్ ఫైల్ చేసి వుంటే.<br>-5 - రిటర్న్స్‌ని ఇంతవరకు ఫైల్ చేయకపోతే. |
| 7 | మండల సమాఖ్యలో వున్న మొత్తం నిధులలో ప్రతీ 100 రూపాయలకి సంపాదించిన లాభము అధికంగా వుండాలి. (అంటే మండల సమాఖ్యకు వున్న నిధులన్నింటినీ చాలా తెలివిగా ఉపయోగించి లాభాన్ని పొందుతుందని అర్థము) | 10- సంపాదించిన ఆదాయము మండల సమాఖ్యలో వున్న మొత్తం నిధులలో (సంవత్సరం ఆఖరులో వున్న బాధ్యతలు) 5 శాతం లేదా ఎక్కువగా వుంటే.<br>5- సంపాదించిన ఆదాయము మొత్తం నిధులలో 2 శాతం నుండి 5 శాతం మధ్యన వుంటే.<br>0- సంపాదించిన ఆదాయము 2 శాతం కన్నా తక్కువ వుంటే. |
| 8 | ఉద్యోగస్తుల సామర్థ్యము అధికంగా వుంది. (మన సిబ్బంది సమర్థవంతంగా వుండాలని మనము అనుకుంటాము, సిబ్బంది సమర్థవంతమును అంచనా వేయుటకు ఇదొక పద్ధతి) | **అ.** 10- సిబ్బందికి చెల్లించిన ప్రతీ 100 రూపాయల వేతనానికి, ఇచ్చిన అప్పు నిల్వ 5000 రూపాయలు అయితే<br>5- ప్రతీ 100 రూపాయల వేతనానికి ఇచ్చిన అప్పు నిల్వ 2000 నుండి 5000 రూపాయల మధ్యన వుంటే.<br>0- ప్రతీ 100 రూపాయల వేతనానికి ఇచ్చిన అప్పు నిల్వ 2000 రూపాయల కన్నా తక్కువ అయితే.<br>**ఆ.** 10- వేతన రూపంలో ఇచ్చిన మొత్తముకన్నా సంపాదించిన లాభము ఎక్కువగా వుంటే.<br>5- సంపాదించిన లాభము ఇచ్చిన వేతనాలకు ఇంచుమించు సమానంగా వుంటే.<br>0- సంపాదించిన లాభము ఇచ్చిన వేతనాలకన్నా చాలా తక్కువగా వుంటే.<br>-5 - మండల సమాఖ్యకి నష్టం వస్తే. |

**ఇతరులు నిన్ను అర్థం చేసుకోలేదని బాధపడకు, ముందు నిన్ను నీవు అర్థం చేసుకో**

ఏ మండల సమాఖ్య అయినా, ఎక్కువగా అంటే 120 మార్కులు సంపాదించగలదు

**అవార్డు**

పరిశీలన మొత్తం స్వయం నియంత్రణ ఉద్యమ సమన్వయ కమిటీ చేయాలి. మండలసమాఖ్యల వివరముల సేకరణ మరియు విశ్లేషణకు ఐకెపి లేదా ఎపి మాస్ సిబ్బంది నుండి సహాయం తీసుకోవచ్చు. పరిశీలనకు సంబంధించిన పేపర్లన్నీ మొదట సమన్వయకమిటీ ముందుంచాలి. ఆ తర్వాత క్లస్టరులో వున్న ప్రతీ మండల సమాఖ్యలలో వున్న కార్య నిర్వాహక వర్గం సభ్యులందరి ముందు వుంచాలి. అప్పుడే వారు ప్రతిభా సూచికలు, అంచనా విధానమును అర్థం చేసుకుని తమ మండల సమాఖ్య కూడా ఆ స్థాయిలో వుండాలని ఆశిస్తారు. మండల సమాఖ్య స్థాయిలో ఉపయోగకరంగా వుండి, అందరికీ కనిపించేటట్లు వుండే విధంగా ప్రింటరు లేక నగదు రిజిస్టరు లేక ఫ్యాక్స్ మిషను వంటి వస్తువు ఏదైనా ఇవ్వవచ్చు. కానీ గడియారం తక్కువ ధరలో దొరుకుతుంది. అందులో అవార్డుకు సంబంధించిన వివరాలు వ్రాయడానికి సరిపడా స్థలము వుంటుంది. అదే సమయంలో మనం మండల సమాఖ్య స్థాయిలో అవార్డు కొరకు ఇంకొంచెం ఎక్కువ ఖర్చు చేయవచ్చు.

ఆ ప్రాంతములో స్వయం సహాయక సంఘాల సభ్యులందరికీ సంబంధించి ముఖ్యమైన సమావేశంలో అవార్డును అందజేయవచ్చు. ఆ కార్యక్రమము రోజంతా జరుపుకునే పెద్ద సందర్భము కావాలి. ఆటల పోటీలు, ఆహారం మరియు ఆటలకు సంబంధించిన స్టాళ్ళతో మేళా మాదిరిగా వుండాలి. కొన్ని అవగాహన సంబంధించిన కార్యక్రమాలు కూడా పెట్టవచ్చు. ఆఖరున అవార్డు బహూకరించవచ్చు. ఇటువంటి కార్యక్రమం పెద్దగా నిర్వహించుటకు వీలు కాదనుకుంటే ఆ మండల సమాఖ్య లలో వున్న సభ్యత్వ గ్రామ సంఘాల కార్య నిర్వాహక వర్గం సభ్యులందరితో ఒక సమావేశం ఏర్పాటు చేయవచ్చు. అందరికీ సంబంధించిన కొన్ని సాధారణ విషయాలు చర్చించి, అవార్డును బహూకరించవచ్చు. అవార్డును ఐకెపి లేదా ఎపి మాస్ సిఇఓ లేదా జిల్లా కలెక్టరుచే అందించ వచ్చు. ఈ సమావేశములో పత్రికలవారిని ఆహ్వానించి, వారితో ప్రత్యేక సమావేశము ఏర్పాటుచేసి, సమన్వయ కమిటీ అధ్యక్షులు మరియు అవార్డు గెలుచుకున్న మండల సమాఖ్య అధ్యక్షులు మాట్లాడాలి. ఇద్దరికీ తగిన గుర్తింపు వుండేలా చూడాలి.

**ముగింపు**

అవార్డు కార్యక్రమము మనమందరము కలిసి పండుగ / వేడుక జరుపుకోవడానికి మనకు ఒక అవకాశం. ఇది మన సమాఖ్యలపై తీర్పు ఇవ్వడానికి కాదు. ఇది వేడుక చేసుకోవడానికి కారణమే కాకుండా మన జీవితములో మంచి ప్రతిభ అంటే ఏమిటి? విజయం అంటే ఏమిటి?అనే వాటిపై మనలను ఆలోచింపజేసే ఒకపద్ధతి. ఈ సందర్భము మన స్థానం ఏమిటో తెలియజేస్తుంది. ఈ అవార్డుల వేడుకను స్వశక్తిపై కాళ్ళమీద ఆధారపడి సభ్యుల అవసరాలను అర్థం చేసుకొని, సభ్యుల ఆధీనములో నడపబడి, ప్రజాస్వామ్యముగా, జవాబుదారీగా నడిచే స్వయం సహాయక ఉద్యమముగా ఎదగటానికి ఉపయోగిద్దాము. ❐

## నిరుపేదలకు లక్ష వార్షికాదాయం లక్ష్యంగా సెర్ప్ వ్యూహం

రాష్ట్రంలో గ్రామీణపేదరికాన్ని నిర్మూలించేందుకు పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) సరికొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తోంది. ఇప్పటికే అమలులోవున్న ఈ విధానాన్ని పలుమార్పులతో 'నిరుపేదల వ్యూహం' పేరిట వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పటిష్టంగా అమలుచేసేందుకు కసరత్తు చేస్తోంది. గ్రామీణ ఉపాధి హామీలో ఒక కుటుంబానికి వందరోజుల పని కల్పిస్తే, కనీసం రూ. 10,000 వస్తుంది. నిరుపేద కుటుంబాలకు గల చిన్నచిన్న భూకమతాలలో పంటల సాగు ద్వారా కనీసం రూ.40 వేల వరకు ఆదాయాన్ని కల్పిస్తారు. డ్వాక్రా ఉత్పత్తులు లేదా ఎస్‌హెచ్‌జిల ద్వారా వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేయించి, విక్రయించడం ద్వారా రూ. 5-10 వేల ఆదాయం లభించేలా చూస్తారు. మొత్తమ్మీద ప్రతి కుటుంబం వార్షికాదాయం రూ.లక్షకు చేరుకునేలా చూసేందుకు సెర్ప్ కసరత్తు చేస్తోంది. ❐

**నీ లక్ష్యం మంచిదైతే ఇబ్బందులకు వెరవకు, అనవసరంగా మథనపడకు**

# స్వయం సహాయ సంఘాల ద్వారా ఎరువుల సరఫరా!

## సాధ్యాసాధ్యాలపై ప్రభుత్వ అధ్యయనం

ఇందిరాక్రాంతి పథం (ఐకేపీ) లోని స్వయం సహాయ సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా రైతులకు ఎరువులను సరఫరా చేసే యోచనలో సర్కారు ఉంది. రాష్ట్రంలో కొన్నేళ్ళుగా ఎస్‌హెచ్‌జీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలను నెల కొల్పి, పెద్ద ఎత్తున వ్యాపారం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అదే తరహాలో రైతులకు ఎరువులను సైతం సరఫరా చేయాలని, సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) యోచిస్తోంది. ప్రస్తుతం ఎరువులను డీలర్లద్వారా, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల (పీఏసీఎస్‌ల) ద్వారా సరఫరా చేస్తున్నారు.

ఇందులో ప్రైవేటు డీలర్లదే కీలకపాత్ర. ఎరువుల కొరత సమస్య తలెత్తిన ప్రతీసారి రైతులు ఆందోళన చేస్తున్నారు. కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌మార్కెట్‌లో విక్రయించడం వంటి ఎత్తుగడలతో... ఎరువుల సరఫరాలో సమస్యలు వస్తున్నాయి. రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితులు ప్రతి సీజన్‌లో సర్వసాధారణమయ్యాయి. ఇది ప్రభుత్వానికి ఇబ్బందికరంగా మారుతోంది. ఎరువుల కంపెనీల డీలర్లు సైతం నగరాలు, పట్టణాలు, ప్రధాన గ్రామాలకే పరిమితమయ్యారు.

ఈ నేపథ్యంలో ఎరువుల సరఫరాను మారుమూల గ్రామాలకు చేర్చడం ఐకేపీతోనే సాధ్యమని భావిస్తున్నారు. మార్కెటింగ్‌లో ఇప్పటికే అనుభవమున్న ఐకేపీ సంఘాలతో క్షేత్రస్థాయిలో ఎరువులను సరఫరా చేయిస్తే ఎలా ఉంటుందనే అంశం ప్రస్తుతం పరిశీలనలో ఉంది. దీనిపై సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని అధికారులకు సంబంధితమంత్రి సునీతాలక్ష్మారెడ్డి సూచించినట్లు సమాచారం. ధాన్యం కొనుగోలుతో ఇప్పటికే మార్కెటింగ్ రంగంలోనూ అనేకచోట్ల సత్ఫలితాలు సాధిస్తున్న ఐకేపీ సంఘాలకు ఎరువుల సరఫరా బాధ్యతను అప్పగిస్తే బహుళ ప్రయోజనకరమని భావిస్తున్నారు. ఇదే సందర్భంలో, కొన్ని ఇబ్బందులూ లేకపోలేదనే వాదన వినవస్తోంది. పెట్టుబడి సమకూర్చుకునే, ఫ్యాక్టరీల నుంచి సకాలంలో ఎరువుల నిల్వలను తెప్పించుకునే సామర్థ్యాన్ని సంఘాలు కలిగి ఉన్నాయా? ప్రభుత్వపరంగా ఎలాంటి సహాయసహకారాలు అవసరం?అనే అంశాలను అధ్యయనం చేశాకే ఈ బాధ్యతలను అప్పగించాలని భావిస్తున్నారు. పేదరిక నిర్మూలనవ్యూహంలోనూ అవసరంమేరకు ఐకేపీ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు గతంలోనే ఆదేశించారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ప్రతి కొనుగోలు కేంద్రాన్ని,రాబోయేఐదేళ్ళలో మినీమార్కెట్‌యార్డుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఎరువుల అమ్మకం కూడా అప్పగించే విషయంలో సాధ్యాసాధ్యాలు, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ, సహకారాలపైనా పరిశీలన చేయనుంది.

**– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో**

### దుక్కిదున్నకుండా విత్తనాలను, ఎరువులను వేసే యంత్రం

**జి.**బి. పంత్ యూనివర్శిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ, పంత్‌నగర్ వారు అభివృద్ధి చేసిన 9 మరియు 11 వరుస లలో ఏకకాలంలో ఎరువులు వేస్తూ విత్తనాలు నాటే యంత్రం, వరిపంట తర్వాత దుక్కిదున్నకుండా (జీరో టిల్లేజి) సాగుచేసే జొన్న, మొక్కజొన్న తదితర పంటలకు అత్యంత అనుకూలం. ఈ యంత్రంతో నిర్దేశిత దూరంలో విత్తనాలు, అలాగే నిర్ధారిత మోతాదులో ఎరువులు పడేటట్లుగా అమరికలు చేసుకోవచ్చు. దీన్నుపయోగించి గంటకు దాదాపు ముప్పావుఎకరం (3/4) విత్తుకోవచ్చు. జీరో టిల్లేజి విధానంద్వారా విత్తుకోవడంవల్ల, ఎకరాకు దాదాపు రూ. 400 నుండి రూ.600 వరకు ఆదా చేసుకోవచ్చు. 'జీరో టిల్ సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రిల్' అనే ఈ యంత్రం ద్వారా విత్తుకుంటే, పంట త్వరితగతిన మొలకెత్తడంవల్ల 5 నుండి 6 శాతం వరకు దిగుబడులు పెరిగినట్లు పరిశోధనలు తెలియచేస్తున్నాయి. ❐

**నీవు గౌరవం పొందాలంటే, ముందుగా ఇతరులను గౌరవించడం నేర్చుకోవాలి**